ప్రజాశక్తి

శనివారం 5 ఏప్రిల్ 2025 8 పేజీలు





ప్రకాశం బాపట్ల

వెలుగులు నింపేందుకు వెళ్లి..

- ఈదురుగాలుల కారణంగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా బంద్
- మరమ్మతులు చేసేందుకు వెళ్లి.. కరెంటు షాక్‌తో లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ మృతి
- సంతాపం తెలిపిన మంత్రి గొట్టిపాటి



మృతిచెందిన లీలాదుర్గాశంకర్, మహేష్

ప్రజాశక్తి-కొల్లూరు, భట్టిప్రోలు

ఈదురు గాలుల కారణంగా కరెంటు వైర్లు తెగి.. ఈపూరు, చిలుమూరు గ్రామాలతో పాటు పలు లంకా గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ లేకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేసి.. ఆయా గ్రామాల్లో వెలుగులు నింపుదామని వెళ్లిన విద్యుత్ సిబ్బంది ఆరుగురిలో ఇద్దరు విద్యుత్ షాక్‌తో మృత్యువాతపడ్డారు. లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ మృతి విషయం తెలుసుకున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

విద్యుత్ షాక్‌తో లైన్‌మెన్, ఎనర్జీ అసిస్టెంట్ మృత్యువాతపడ్డారు. ఈ ఘటన కొల్లూరు మండల పరిధిలోని ఈపూరు గ్రామంలో శనివారం వేకువజామున జరిగింది. ఈదురుగాలుల కారణంగా ఈపూరు, చిలుమూరు గ్రామాలతో పాటు నదీగర్భంలో ఉన్న లంక గ్రామాలకు కూడా సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆరుగురు విద్యుత్ సిబ్బంది శనివారం ఉదయం సుమారు ఐదు గంటల సమయంలో మరమ్మతులు చేపట్టేందుకు వెళ్లారు. ఇదే ప్రాంతంలో 33 /11 కెవి విద్యుత్ వైర్లు కూడా ఇదే స్తంభాలకు పైగా ఉండి విద్యుత్ సరఫరా అవుతుంది. అయినప్పటికీ కింద తెగిపోయిన వైర్లను చేతిలో ఉన్న కటింగ్ ప్లేయర్ ద్వారా బిగిస్తున్నారు. విద్యుత్తు స్తంభాలపై నుండి నలుగురు వ్యక్తులు బిగించి కిందకు దిగారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో దోనేపూడి లైన్‌మెన్ పాతర్లంక లీలా దుర్గా శంకర్ (40), ఈపూరు గ్రామ ఎనర్జీ అసిస్టెంట్ ఆకుల మహేష్ (35) మృతిచెందారు. లీలా దుర్గాశంకర్ ధోనిపూడి గ్రామానికి చెందిన వ్యక్తి. ఈయన కుటుంబం తెనాలిలో నివాసం ఉంటున్నారు. ఇతనికి భార్య, కుమార్తె ఉన్నారు. ఆకుల మహేష్ ఈపూరు గ్రామానికి చెందిన వ్యక్తి. ఇతనికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనా స్థలాన్ని కొల్లూరు పోలీసులు పరిశీలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తెనాలి వైద్యశాలకు తరలించారు. కొల్లూరు ▶ 2లో

ముంచిన అకాల వర్షం

- బొప్పాయి రైతులకు తీరని నష్టం
- పోతంపల్లి చెరువుకు గండి
- కొమరోలులో పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి



యర్రగొండపాలెంలో నేలమట్టమైన బొప్పాయి తోట



పోతంపల్లి చెరువుకు గండి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ఉద్యాన శాఖ పరిధిలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షం, ఈదురుగాలలుకు బొప్పాయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఆరుగాలం కష్టించి కంటికి రెప్పలా కాపాడుకున్న బొప్పాయి తోటలు తీవ్రమైన గాలులు, అనుహ్యామైన వర్షంతో బొప్పాయి చెట్లను నేలమట్టం చేశాయి. చెట్లన్నీ విరిగి పడ్డాయి. కాపుకు వచ్చే దశలో ఉన్న కాయలన్నీ మట్టిపాలయ్యాయి. బొప్పాయి తోటలు పూర్తిగా నాశనమయ్యాయి. రైతులు మౌనంగా తమ తోటలను పరిశీలిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బొప్పాయి రైతులు కోరుతున్నారు.

చెరువుకు గండి..

పెద్దారవీడు: మండలంలో అకాల వర్షం కురిసింది. గురువారం సాయంత్రం మొదలైన వర్షం రాత్రి వరకు కురిసింది. భారీగా కురిసిన వర్షంతో అక్కడక్కడా వాగులకు, చెరువులకు నీరు చేరింది. మండలంలోని పోతంపల్లి గ్రామ పరిధిలోని చెరువు నిండుకుంది. శుక్రవారం ఉదయానికి చెరువుకట్టకు లీకులు ఏర్పడ్డాయి. కట్ట తెగుతుందని జలవనరుల శాఖ అధికారులకు గ్రామస్తులు సమాచారం అందించారు. సకాలంలో స్పందించలేదు. లేకలేక వచ్చిన వర్షపు నీరు చెరువుకట్టకు పడిన గండి ద్వారా పోవడంతో రైతులు ఆందోళన చెందారు. అదే గ్రామానికి చెందిన దుద్దేల వెంకటరెడ్డి స్పందించారు. జెసిబి యంత్ర సాయంతో చెరువుకు పడిన గండిని పూడ్చగలిగారు. దీంతో ఆ చెరువులో కొంతమేర నీటిని కాపాడుకోగలిగారు. తీరిగ్గా వచ్చిన అధికారులు మాత్రం చెరువు గండివద్ద ఫోటోలకు ఫోజులిచ్చి వెళ్లడం ▶ 2లో



పిడుగుపాటుకు మృతిచెందిన గేదెలు




అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్‌అన్సారియా

తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా 8లో

త్వరలో విద్యార్థినులందరికీ సైకిళ్లు

మంత్రి గొట్టిపాటి రవికుమార్ 5లో



కరపత్రాలు పంచుతున్న సిపిఎం నాయకులు

మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపిస్తాం..

- త్వరలోనే మైనింగ్ రంగంలో నూతన పాలసీ తీసుకొస్తాం
- మంత్రి కొల్లు రవీంద్ర



గ్రానైట్ ఫ్యాక్టరీలో పరిశీలిస్తున్న కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే విజయ్‌కుమార్

ప్రజాశక్తి-మద్దిపాడు

మైనింగ్ రంగంలో ప్రకాశం జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని, జగన్ పాలనలో మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపిస్తామని మంత్రి రవీంద్ర తెలిపారు. మండల పరిధిలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్లోని సెజ్ లోని ఫ్యాక్టరీలను స్థానిక ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో 1500కు పైగా మైనింగ్ సంస్థలు ఉన్నాయన్నారు. ఒంగోలు సెజ్‌లో వందకు పైగా ప్లాంట్స్ ఏర్పాటు చేయడం ఇక్కడ అవకాశాలకు నిదర్శనమన్నారు. మైనింగ్ వ్యవస్థను రాష్ట్ర ఆదాయ సమపార్జనతో పాటు, ఉపాధి అవకాశాలు పెంచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి పేర్కొన్నారు. ఎమ్మెల్యే బిఎన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రానైట్ సమస్యలపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. త్వరలోనే ఈ రంగాన్ని ఆదుకుంటామని వారు హామీ ఇచ్చారని తెలిపారు. ఉద్యోగ అవకాశాలు కూడా మరిన్ని పెరగనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

సమస్యలపై మంత్రికి వినతి

ప్రస్తుతం గ్రానైట్ పరిశ్రమ ▶ 2లో

'వక్ఫ్' సవరణను వ్యతిరేకించండి..

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

ప్రజాశక్తి-బాపట్ల

మైనారిటీ హక్కులను హరించే వక్ఫ్ సవరణలను వ్యతిరేకించాలని, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఐక్యంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలో పాత బస్టాండ్ వద్ద అంజుమన్ కమిటీ మసీదు, ఉప్పరపాలెం, ఇస్లాంపేట మసీదుల వద్ద సిపిఎం నాయకులు వక్ఫ్ సవరణపై జిల్లా కమిటీ ప్రచురించిన కరపత్రాలు పంపిణీ చేశారు. గంగయ్య మాట్లాడుతూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు భిన్నంగా ముస్లిం వ్యతిరేకతతో సవరణ చేయడాన్ని తప్పుపట్టారు. ఈ చర్యకు వ్యతిరేకంగా అందర్నీ కలుపుకొని ఐక్యంగా ఉద్యమించాలని కోరారు. పట్టణంలో మసీదుల వద్ద జరిగిన కార్యక్రమంలో అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ, కార్యదర్శి కరీం, మాజీ కార్యదర్శి వలీ, సిపిఎం నాయకులు కృష్ణమోహన్, కొండయ్య, శరత్, నాగేశ్వరరావు, భగవాన్, సుభాని పాల్గొన్నారు.

ముంచిన అకాల వర్షం

(మొదటిపేజీ తరువాయి)

విమర్శలకు తావిచ్చింది.

పిడుగుపాటుకు మూడు గేదెలు మృతి

కొమరోలు: కొమరోలు మండలంలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి పిడుగు పడి మూడు గేదెలు మృతిచెందాయి. ఎడమకల్లు గ్రామంలో మల్లెపోగు యాకోబుకు చెందిన రెండు గేదెలు కల్లంలో కట్టేసి ఉండగా రాత్రి ఆ పాకకు సమీపంలో పిడుగు పడటంతో మృతిచెందాయి. మదవపల్లె గ్రామంలో ఒక గేదె మృతిచెందింది. ఈ గేదెలకు పశు వైద్యాధికారి వినోద్‌కుమార్ పోస్టుమార్టం చేశారు.

వెలుగులు నింపేందుకు వెళ్లి..

(మొదటిపేజీ తరువాయి)

మండలం ఈపూరు వద్ద విద్యుత్తు షాక్‌కు గురై సిబ్బంది మృతి చెందటం పట్ల విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు.

తక్షణ సాయం అందజేత

మృతిచెందిన పి.లీలదుర్గా శంకర్, ఆకుల మహేష్ కుటుంబాలకు తక్షణ సాయంగా బాపట్ల కలెక్టర్ ఆదేశాల మేరకు పది వేల రూపాయలను కొల్లూరు మండల తహశీల్దార్ బి.వెంకటేశ్వర్లు అందజేశారు.

మూతపడిన ఫ్యాక్టరీలను తెరిపిస్తాం..

(మొదటిపేజీ తరువాయి)

గడ్డుకాలం నడుస్తుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రానైట్ పాఠశాలకు పూర్వవైభవం తీసుకొచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని గుండ్లపల్లి గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షులు మండవ రత్నాకర్‌రావు ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ యజమానులు తమ సమస్యలను మంత్రి దష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే అనేక ఫ్యాక్టరీలు మూతపడ్డాయని చెప్పారు. సబ్సిడీలను త్వరగా మంజూరు చేయాలని, ప్రస్తుతం స్లాబ్ సిస్టంలో మూడు నెలల లోపు రాయి తెచ్చుకునే విధంగా వేసులుబాటు కల్పించాలని మంత్రిని వారు కోరగా దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర కృష్ణసాయి గ్రానైట్స్ ఎక్స్‌పోర్ట్ కంపెనీని పరిశీలించారు. కార్యక్రమంలో మైనింగ్ పిడి రాజశేఖర్, ఏజి రవి వర్మ, ఒంగోలు విజిలెన్స్ ఎడి రామచంద్ర, ఏజీ సురేష్ కుమార్ రెడ్డి, మార్కాపురం ఏడిఈ విష్ణువర్ధన్, ఏజీ పోల్ రెడ్డి, ఎక్సైజ్ శాఖ అధికారులు, ఎమ్మార్వో సుజన్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షులు మండవ జయంత్ బాబు, గ్రానైట్ యజమానులు రాజేంద్ర సంక్లన్, అజిత్, మహేష్, శివరాం, ఉదయ్, రామ్మోహన్‌రావు, శ్రీనారాయణ, రవి, చంద్రారెడ్డి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

తూతూమంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి-పొన్నలూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కొండాబత్తిన మాధవ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాధవ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందజేయాలని అధికారులకు సూచించారు. జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 'మహాత్మగాంధీ ఉపాధి హామీ'లో అవినీతి జరుగుతోందని ఏపీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలా జరిగితే తాము పై అధికారుల దృష్టికి తీసుకొని వెళతామని ఎంపీడీవోకు తెలియపరిచారు. హౌసింగ్ ఇండ్లల్లో అవినీతి జరక్కుండా చూడాలని ఏఈకి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి సుజాత, ఆయా శాఖల అధికారులు, ఎంపిటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనకు కృషి: జేసీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

జిల్లాలో నాటుసారా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ అధికారులకు చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నాటు సారా నిర్మూలన జిల్లా స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రఖర్ జైన్ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారు చేసే గ్రామాలను గుర్తించాలన్నారు. జిల్లాలో నాటుసారా నిర్మూలనకు గ్రామ స్థాయి, మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేయాలని అధికారులకు చెప్పారు. ముందుగా గ్రామాలలో నాటుసారా నిర్మూలనపై ప్రజ లకు అవగాహన కల్పించాలన్నారు. నాటు సారా తయారు చేయడంలో మార్పులు రాన ట్లయితే గ్రామాలలో తయారీదారులపై దాడు లు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో పోలీస్, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి నాటుసారా నిర్మూ లనకు కషి చేయాలని ఆయన అన్నారు. నాటు సారా తయారీదారులు మానుకున్నట్లయితే



అధికారులతో మాట్లాడుతున్న జేసీ ప్రఖర్‌జైన్

వారి జీవనోపాధులు మెరుగుపరచడానికి గిరిజన సంక్షేమశాఖ ద్వారా బ్యాంకు రుణాలు అందించడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. సమావేశంలో ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరిండెంట్ వెంకటేశ్వరరావు, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లాఅటవీ శాఖ అధికారి భీమానాయక్, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

'శక్తి' యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తక్షణ పోలీస్ సహాయం కోసం మహిళలు శక్తి యాప్ వినియోగించుకునే విధానం గురించి జిల్లాలోని శక్తి బృందాలు విస్తత అవగాహన కల్పిస్తున్నాయి. జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు బాపట్ల పట్టణ ఎస్ఐ చంద్రావతి ఆధ్వర్యంలోని శక్తి బృందం శుక్రవారం బాపట్ల మహిళా ఇంజినీరింగ్ కళాశాలలోని విద్యార్థినులకు "శక్తి యాప్" గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో సుమారు 200 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. కొందరు విద్యార్థినులను ఎంపిక చేసి వారితో శక్తి వారియర్ గ్రూప్‌లను ఏర్పాటు చేసి గ్రూప్ యొక్క ప్రత్యేకతలను వివరించారు. ఈ సందర్భంగా మహిళా ఎస్ఐ మాట్లాడుతూ "శక్తి యాప్" మహిళల భద్రత కోసం రూపొందించబడిందన్నారు. అత్యవసర పరిస్థితులలో పోలీస్ తక్షణ సహాయం అవసరమైనప్పుడు



శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న విద్యార్థినులు

ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

నాగులుప్పలపాడులో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

ప్రజల దాహర్తిని తీర్చేందుకు నాగులుప్పలపాడు పోలీస్ స్టేషన్ పరిదిలో చలివేంద్రం ఏర్పాటు చేయాలని ఎస్పి ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఎస్ఐ శ్రీకాంత్ గ్రామస్తులచే మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. తద్వారా బాటసారులకు, స్టేషన్‌కు వచ్చేవారికి వేసవిలో దాహర్తి తీరుతుందని ఎస్ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

27 ఆయిల్ పీపాలు పట్టివేత

ప్రజాశక్తి-మద్దిపాడు

అక్రమంగా నిల్వ ఉంచిన 27 ఆయిల్ పీపాలను సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఈనెల మూడో తేదీన ప్రజాశక్తి పత్రికలో 'ఆయిల్ దందాకు అధికారుల అండ' అనే వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు మండల పరిధిలోని గుండ్లపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన 180 లీటర్ల సామర్థ్యం కలిగిన 27 ఇదనాల్ ఆయిల్ పీపాలను స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.2 లక్షల వరకు ఉంటుందని, సదరు నిర్వాహకుడిపై కేసు నమోదు చేసినట్లు సివిల్ సప్లై అధికారులు తెలిపారు.

శ్రీసాయి బాలాజీలో గ్రాడ్యుయేషన్ వేడుక

ప్రజాశక్తి-మార్కాపురం

స్థానిక శ్రీసాయి బాలాజీ హైస్కూల్ శుక్రవారం గ్రాడ్యుయేషన్ వేడుకతో పాటు నాలెడ్జి ఎక్స్‌పో నిర్వహించారు. 5వ తరగతి పూర్తి చేసుకుని 6వ తరగతిలోకి ప్రవేశించనున్న విద్యార్థుల నాల్జెడిని తల్లిదండ్రుల ముందు వ్యక్తపరిచి, వారికి గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను అందించారు. ఈ వేడుక ఆ పాఠశాల ప్రైమరీ ఇన్‌చార్జి సుభాషిణి ఆధ్వర్యంలో జరిగింది. ప్రిన్సిపల్ పి ప్రకాశరావు వేడుకలను ప్రారంభించారు.



గ్రాడ్యుయేషన్ వేడుకలో విద్యార్థులు

గుండెపోటుతో లాయర్ మృతి

ప్రజాశక్తి-పంగులూరు



రవిప్రసాద్ (ఫైల్)

గుండెపోటుతో పంగులూరు గ్రామానికి చెందిన లాయర్ బాచిన వెంకట రవి ప్రసాద్ (54) మరణించాడు. గత కొంతకాలంగా విజయవాడ కోర్టులో పనిచేస్తున్న వెంకట రవి ప్రసాద్ గురువారం సాయంత్రం కోర్టు నుంచి వచ్చిన కొద్దిసేపటికి గుండె పోటు రావడంతో మృతి చెందాడు. రవి ప్రసాద్ మృత దేహాన్ని గురువారం రాత్రికి పంగులూరు తీసుకొచ్చారు. రవి ప్రసాద్ విజయవాడ బార్ అసోసియేషన్‌లో సభ్యుడిగా కూడా ఉన్నారు. రవి ప్రసాద్ మూర్తి అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించారు. మృతి చెందిన వెంకట రవి ప్రసాద్‌కు భార్య కిరణ్మయి, కుమార్తె దేవాన్షిక ఉన్నారు.

సైకిల్ స్టాండ్ తొలగింపునకు చర్యలు

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల ఏరియా వైద్యశాల ప్రాంగణంలో గత కొన్నేళ్లుగా అద్దె ప్రాతిపదికను నిర్వహిస్తున్న సైకిల్ స్టాండ్, క్యాంటీన్ తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. ఆసుపత్రి అభివృద్ధిలో భాగంగా క్యాంటీన్, సైకిల్ స్టాండ్‌ను ఖాళీ చేయించాలనే క్రమంలో అద్దె కాలాన్ని పొడిగించక పోవడంతో నిర్వాహకులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయితే మార్చి 31 నాటికి సైకిల్ స్టాండ్, క్యాంటీన్ ఖాళీ చేయాలని కోర్టు పేర్కొంది. శుక్రవారం ఆసుపత్రి సూపరింటెండెంట్ సిద్ధార్థ ఆధ్వర్యంలో క్యాంటీన్‌కు తాళాలు వేశారు. సైకిల్ స్టాండ్‌ను తొలగించే ప్రక్రియలో భాగంగా స్టాండ్‌లో ఉన్న వాహనాలను పక్కకు చేర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా అక్కడ ఉన్న షెడ్డును జెసిబితో తొలగించారు. అయితే మరికొన్ని రోజులు గడువు కోరుతూ అద్దె నిర్వాహకులు తొలగింపు చర్యలకు అడ్డుకున్నారు. దీంతో ప్రజా సంఘాల నాయకులు పలువురు చేరుకుని కొంత గడువు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి 31కి క్యాంటీన్, సైకిల్ స్టాండ్ ఖాళీ చేయాలని కోర్టు ఉత్తర్వులు మేరకే మేము వాటిని తొలగిస్తున్నామన్నారు. సిఐ రాంబాబు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.

దరఖాస్తులు పరిశీలన

ప్రజాశక్తి-యద్దనపూడి

యద్దనపూడి మండలం పరిధిలోని 14 గ్రామ పంచాయతీల్లో స్వయం ఉపాధి క్రింద వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారికి క్రెడిట్ క్యాంపు నిర్వహించుటకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. బ్యాంకు మేనేజర్లు, అధికారుల సమక్షంలో క్రెడిట్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపుకి అర్జీదారులందరు అందరూ హాజరు అయ్యారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అద్దంకి

రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ ఆధ్వర్యంలో, వినుకొండ డాక్టర్ దస్తగిరి వెన్నెల నేత్రాలయం వారి సౌజన్యంతో స్థానిక గీతా మందిరంలో డాక్టర్ పూర్ణిమ బృందం ఉచిత నేత్ర వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 120 మంది కంటి పరీక్షలు చేసి, 50 మందికి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వారికి వినుకొండ వెన్నెల నేత్రాలయములో ఉచితంగా శుక్లం ఆపరేషన్ చేస్తామని తెలిపారు. 10 మందిని శుక్లం ఆపరేషన్ కొరకు తరలించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, సెక్రటరీ చుండూరి మురళీ సుధాకర రావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీ కృష్ణ, పసుపులేటి ఆంజనేయులు, అలహరి హరి ప్రసాదు, డాక్టర్ దేవ పాలన, పువ్వాడ రామకోటేశ్వరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, ఊటుకూరి రామకోటేశ్వరావు, నర్రా శ్రీలక్ష్మి, అన్నంగి సుబ్బారావు, నరసింహారావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, అంజాద్ భాష, నాగయ్య, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి షేక్ మహమ్మద్ రఫీ, చిన్ని మురళీ కృష్ణ ఆర్థిక సాయం అందించారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఐలవరం గ్రామ పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు సూచించారు. మండలంలోని ఐలవరం గ్రామ సచివాలయంలో శుక్రవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు.

ఇంకొల్లులో భారీ చోరీ

రూ.55 లక్షలు నగదు, 25 సవర్లు బంగారం అపహరణ

ఇంకొల్లు-ప్రజాశక్తి

ఇంకొల్లులోని బస్టాండు సమీపంలో ఓ ఇంటిలో దొంగలు పడి రూ.55 లక్షలు నగదు, 25 సవర్లు బంగారం అపహరించారు. అందిన వివరాల మేరకు.. గంగవరానికి చెందిన జాగర్లమూడి శివ కుమార్, జాగర్లమూడి వేణు అన్నదమ్ములు ఇంకొల్లు బస్టాండ్ ఎదురు గత కొన్నేళ్లుగా సొంత భవనం నిర్మించుకొని ఉంటున్నారు. శివ పర్చూరు రోడ్డులో కూరగాయల దుకాణం నడుపుతుండగా, వేణు వారి భవనంలో బాలాజీ మెస్ నడుపుతూ ఉన్నాడు. గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బాలాజీ మెస్ పై అంతస్తులో ఉన్న ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలోని రూ.55 లక్షల నగదు, 25 సవర్ల బంగారాన్ని దొంగిలించారు. ఆ సమయంలో దొంగతనం జరిగిన పై ఫ్లోర్లో ఎవరూ లేరు. వేకువ జామునే దొంగతనం జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఇంకొల్లు సిఐ రమణయ్య, ఎస్సై జి.సురేష్‌లతో పాటు చిన్నగంజాం ఎస్ఐ వచ్చి దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్ టీం వచ్చి నమూనాలు సేకరించి కుటుంబ సభ్యుల వద్ద నగదు మరియు బంగారానికి సంబంధించిన వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు, సిఐ రమణయ్య, ఎస్ఐ సురేష్ తెలిపారు.



కుటుంబ సభ్యులను విచారిస్తున్న పోలీసులు

క్రైమ్ కాలమ్

బైక్‌ను ఢీకొన్న గుర్తు తెలియని వాహనం

వ్యక్తి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-పెద్ద దోర్నాల



మృతి చెందిన విజయభాస్కర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి మృతి చెందడంతో పాటు వెనుక కూర్చున్న మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని గంటావానిపల్లి సమీపంలో శుక్రవారం రాత్రి జరిగింది. బంధువుల కథనం ప్రకారం వై చెర్లోపల్లి గ్రామానికి చెందిన పాముల విజయభాస్కర్ (25) సంవత్సరాలు, కటారు పోలయ్యలు పెద్దదోర్నాల నుంచి మోటార్ సైకిల్‌పై తమ స్వగ్రామమైన వైచెర్లోపల్లి వెళ్తున్నారు. గంటావానిపల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. పాముల విజయభాస్కర్ తలకు తీవ్ర గాయం అయింది. కటారు పోలయ్యకు కాలు నుజ్జునుజ్జు అయ్యింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మహేంద్ర అక్కడికి వెళ్లి తన వాహనంలో వారిని పెద్ద దోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలలో చేర్పించారు. చికిత్సలు అందించేలోపే విజయభాస్కర్ మృతి చెందాడు. అతనికి ఇంకా వివాహం కాలేదు. కటారి పోలయ్యకు ప్రాథమిక చికిత్స అందించి మె రుగైన చికిత్స కోసం నరసరావుపేటకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-ముండ్లమూరు

ముండ్లమూరు మండల వీఆర్ఏల జనరల్ బాడీ సమావేశం వరగాని యేసు అధ్యక్షతన శుక్రవారం ముండ్లమూరులో జరిగింది. ఈ సమావేశానికి ప్రధాన ఉపన్యాసకులుగా వీఆర్ఏ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గంటెనపల్లి శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్ఏలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని తెలిపారు. సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు. తెలంగాణ తరహాలో పే స్కేలు అమలు చేయాలని, నైట్ డ్యూటీలు వీఆర్ఏలకు వేయరాదని, నామినీలుగా పనిచేస్తున్న వారిని వీఆర్ఏలుగా గుర్తించాలని, అర్హత కలిగిన వారికి వీఆర్వో, అటెండర్, వాచ్మెన్, డ్రైవర్లు, రికార్డ్ అసిస్టెంట్ ప్రమోషన్లు ఇవ్వాలని, ఖాళీలను భర్తీ చేయాలని శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వీఆర్ఏ సమస్యల పరిష్కారానికి రూపకల్పన చేయటానికి 5న విజయవాడ మాకినేని బసవ పున్నయ్య భవన్‌లో రాష్ట్ర సదస్సు జరుగుతుందన్నారు. ఈ సదస్సుకు జిల్లాలోని వీఆర్ఏలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అనంతరం సిఐటియు మండల కార్యదర్శి బొడపాటి హనుమంతరావు వీఆర్ఏలు సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు.

మండల కమిటీ ఎన్నిక

నూతన వీఆర్ఏ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా వరగాని యేసు, మండల కార్యదర్శిగా పొట్లూరు జ్యోతి, కోశాధికారిగా తుమ్మెద నాగార్జున రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా షేక్ మహబూబ్ బాషా, జాయింట్ సెక్రటరీగా తప్పెడ కోటయ్య, కమిటీ సభ్యులుగా నూనె కోటేశ్వరావు, పాలెపోవు కోటేశ్వరావు, మంగమ్మ పాలిపోగు సులోచన, నంబూరి సునీల్, తాతపూడి కోటయ్య, దేవిడ్, గోరుపోవు మేలమ్మ, గంగరాజు తదితరులు కమిటీ సభ్యులుగా ఎంపికయ్యారు.

క్రైస్తవులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-రేపల్లె



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి కలగాలని, క్రైస్తవులకు రక్షణ కల్పించాలని రేపల్లె ఏరియా క్రైస్తవ సంఘాలు ప్రజాసంఘాలు శాంతిర్యాలీ నిర్వహించారు. శుక్రవారం అయోవా స్కూల్ నుంచి తాలూకా వద్దకు పాస్టర్ ప్రవీణ్ పగడాల చిత్రపటాలతో జోహార్లు తెలియజేస్తూ, న్యాయం కావాలంటూ నినాదాలతో ప్రదర్శన నిర్వహించి రేపల్లె మండలం తహశీల్దార్ కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ ప్రదర్శన సందర్భంగా బస్టాండ్ సెంటర్ వద్ద బిషప్ డాక్టర్.రెబ్బా ఇమ్మానియేల్, సిహెచ్ మణిలాల్, జి.ప్రశాంత్‌లు మాట్లాడుతూ దేశంలో క్రైస్తవులకు రక్షణ కల్పించాలని, రెండు తెలుగు రాష్ట్రాల పరిధిలో అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఆత్మకు శాంతి చేకూరాలని, అవకతవకలు లేకుండా దర్యాప్తు చేపట్టాలన్నారు. క్రైస్తవులు సమాజం బాగుండాలని కోరుకుంటారని, క్రమశిక్షణ కలిగిన జీవితంతో శాంతిని కోరుకుంటారని తెలిపారు. అటువంటి దైవసేవకులు, క్రైస్తవులపై ఎటువంటి దాడులు జరగకుండా ప్రభుత్వాలు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేపల్లె నియోజకవర్గం పరిధిలో పాస్టర్లు అబ్రహం, జకరయ్య, విజయరాజు, ప్రజాసంఘాల నేతలు, పి.రమేష్, చిత్రాల ఓబేదు, రమేష్ రాంజీ, ప్రభు పి.హనోక్, జి.ఇమ్మానుయేల్ భాస్కర్, కే.రవి కిరణ్, పి.ప్రేమలత, ఎన్.సురేష్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-మార్కాపురం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

మార్కాపురం పట్టణంలోని కాలేజి రోడ్డులో గల జాకీ షోరూంలో గుర్రాల మహేష్ కుమార్ (26) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జాకీ షోరూంలో గుర్రాల మహేష్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం జాకీ షోరూం తెరవగా మహేష్‌కుమార్ తీగలతో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. ఈ విషయాన్ని పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. మార్కాపురం పట్టణంలోని నాగులవుట్టుకు చెందిన గుర్రాల మహేష్‌కుమార్‌కు వివాహం కాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. ఎస్ఐ డాక్టర్ రాజమోహన్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పట్టణ-2వ ఎస్ఐ డాక్టర్ ఎం.రాజమోహన్‌రావు మృతదేహాన్ని పరిశీలించారు. అతని వద్ద లేఖ లభించింది. 'మనిషిని మనిషిగా చూడాలి, అవసరం కోసం చూడకూడదు, నా జీవితంలో మనిషిని మనిషిగా చూశాను. అందరినీ నమ్మాను. నమ్మిన వారితో నరకం చూశాను. తాను ఎవరినీ తన అవసరానికి వాడుకోలేదు. జీవితంపై విరక్తి చెందాను. నా జీవితంలో ఇదే చివరి రోజు' అని ఆ లేఖలో పేర్కొన్నారు.



తిరగబడిన లారీ

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

ప్రజాశక్తి-పెద్దారవీడు



మృతి చెందిన ఖాజావలి

కుక్కను తప్పించబోయి వాహనం తిరగబడి పలువురికి గాయాలుకాగా వారిని రక్షించేందుకు వస్తున్న వారిని మరో వాహనం ఢీకొనడంతో ఓ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన గొబ్బూరు-తోకపల్లి గ్రామాల మధ్య జాతీయ రహదారి-565లో గురువారం రాత్రి జరిగింది. తుపాను వాహనం అదుపు తప్పి పడిపోవడంతో వాహనంలో ఉన్న 13 మందిలో కొందరికి స్వల్ప గాయాలయ్యాయి. వెనుకనే మిర్చి లోడుతో వస్తున్న లారీ డ్రైవర్, క్లీనర్, రైతులు ప్రమాదాన్ని గుర్తించి సాయం చేయడానికి దిగారు. ఆ సమయంలో మరో డిసిఎం వాహనం మిర్చిలారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు మిర్చి రైతులతో పాటు లారీ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వీరిలో గొడుగు ఖాజావలి మృతి చెందాడు. చనిపోయిన రైతు కడప జిల్లా పోరుమామిళ్ల మండలంలోని పుల్లవీడు గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గాయపడిన డ్రైవర్‌తో పాటు మరో రైతును, ఢీకొట్టిన డిసిఎం వాహనం డ్రైవర్‌ను మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో ఒంగోలులోని రిమ్స్ హాస్పటల్‌కు తరలించారు. పెద్దారవీడు ఎస్ఐ పి.అనిల్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు దగ్ధం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

గుంటూరు నుంచి శ్రీశైలం వెళ్తున్న కారు చింతల సమీపంలోని ఘాట్ రోడ్డులో శుక్రవారం దగ్ధమైంది. కారులో ఉన్న వారు అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. గుంటూరుకు చెందిన జివిఎల్ రవీంద్ర కుమార్ తన నలుగురు కుటుంబ సభ్యులతో కలిసి కారులో శ్రీశైలం బయలుదేరారు. పెద్దదోర్నాల మండలంలోని చింతల సమీపంలో గల ఘాట్ రోడ్డులోకి వెళ్లగానే కారులో వాసన వస్తోంది. దీంతో అప్రమత్తమైన కుటుంబ సభ్యులు వెంటనే కారు ఆపి బయటకు వచ్చారు. వెనువెంటనే కారులో నుంచి మంటలు వచ్చి కారంతా దగ్ధమైంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్ల ఎంపిక

రేపల్లె మార్కెట్ యార్డు చైర్మన్‌గా అనురాధ

ప్రజాశక్తి-రేపల్లె



అనూరాధ

రేపల్లె వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా రేపల్లె నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయకర్త మత్తి భాస్కరరావు సతీమణి అనురాధను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్ పదవి ఓసి మహిళకు కేటాయించడంతో ఆస్థానంలో అనురాధ పేరును కూటమి ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. గతంలో వైసీపీ ప్రభుత్వం హయాంలో రేపల్లె పట్టణ వైసిపి కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి సతీమణి గడ్డం కోటేశ్వరమ్మ ఓసి మహిళ కోటాలో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా పని చేశారు.



పూర్ణ కుమారి

వేమూరు: వేమూరు మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌గా అమర్తలూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకురాలు గొట్టిపాటి పూర్ణ కుమారి నియమితులయ్యారు. ఈమె అమర్తలూరు మండల ఎంపిపీగా పనిచేశారు. అలాగే పూర్ణ కుమారి భర్త గుట్టిపాటి భానుగంగాధర్ మండల టిడిపి అధ్యక్షుడిగా కూడా వ్యవహరించారు. ముఖ్యంగా పూర్ణ కుమారి గంగాధర్ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవతో పాటు నిరంతరం పేదవారికి, ఆయా రకాల బాధితులకు సహాయ సహకారాలు అందిస్తూ ఉంటారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలలో వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు గెలుపుకు అమర్తలూరు మండలంలో విశేష కృషిచేసి ఆయనకు పూర్తి మెజార్టీని సాధించడంలో గుర్తింపు పొందారు. ఆమెకు నియోజకవర్గ టిడిపి నాయకులు కార్యకర్తలు అభినందనలు తెలిపారు. తన నియామకానికి కృషిచేసిన వేమురు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



సీఎం చంద్రబాబుతో జనార్ధన్

చీరాల: కూటమి ప్రభుత్వం మరోసారి చేనేలకు పెద్ద పీట వేసింది. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయం మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవుల జాబితాను విడుదల చేశారు. ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చొరవతో చీరాల వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్‌గా టిడిపి సీనియర్ నాయకులు బాపట్ల జిల్లా బీసీ సెల్ ప్రెసిడెంట్ కౌతరపు జనార్ధన్ నియమితులు అయ్యారు. ఆయన నియామకం పట్ల చేనేతలు నియోజకవర్గం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కొండయ్యకు చేనేత నాయకులు, ప్రతినిధులు కృతజ్ఞతలు తెలియజేశారు.



తేలప్రోలు రమేష్

సంతమాగులూరు: సంతమాగులూరు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా తేలప్రోలు రమేష్ నియమితులయ్యారు. మండలంలోని కుందుర్రు గ్రామానికి చెందిన రమేష్ 2004 నుంచి మంత్రి గొట్టిపాటి రవికుమాంకు నమ్మిన బంటుగా ఉన్నాడు. 2019 నుండి 24 మధ్యకాలంలో బాపట్ల పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు. తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మండలంలో తెలుగుదేశం పార్టీకి తానై నిలబడి పార్టీ బలోపేతానికి, రవికుమార్ ఎమ్మెల్యేగా గెలుపొందటానికి కృషి చేశారు. అంతేగాక రమేష్ కుందుర్రు గ్రామంలో పాఠశాలల అభివృద్ధి, సీసీ రోడ్లు పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు.



గుంజి వెంకట్రావు

ఇంకొల్లు: పర్చూరు మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్‌గా ఇంకొల్లు మాజీ జడ్పిటిసి పావులూరు గ్రామానికి గుంజి వెంకట్రావు ఎంపికయ్యారు. వెంకట్రావు ప్రస్తుతం టిడిపి పార్టీలో రాష్ట్ర బీసీ సెల్ అధ్యక్షులుగా పర్చూరు నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ ఉన్నాడు. బీసీ కులానికి చెందిన వెంకట్రావు, టిడిపి పార్టీ ఆవిర్భావం నుంచి ఆ గ్రామంలో టిడిపి పార్టీ ప్రముఖ కార్యకర్తగానే కొనసాగుతూ వచ్చారు. నియోజకవర్గంలో పలువురు ప్రముఖ నాయకులతోపాటు పలువురు కార్యకర్తలతో ఆది నుంచి మంచి సంబంధాలు ఉన్నాయి. 2014లో ఇంకొల్లు జడ్పీటీసీగా కొనసాగాడు. ముఖ్యమంత్రి చంద్రబాబుకు, మంత్రి లోకేష్‌కు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుకు, జిల్లా ఇన్చార్జి మంత్రి పులుసు పార్థసారధికి బాపట్ల ఎంపీ తేనేటి కృష్ణ ప్రసాద్‌లకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు వెంకట్రావుతో పాటు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి గుంజి వెంకట్రావుకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నదాతల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయాలన్నారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ప్రభుత్వ లక్ష్యాలు రైతుల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పంట ఉత్పత్తులను మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

హెచ్ఐవి నిర్మూలనకు సమన్వయంతో పనిచేయాలి

వాల్‌పోస్టర్ ఆవిష్కరణలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని అప్పుడే క్షేత్రస్థాయిలో హెచ్ఐవి నిర్మూలన సాధ్యమవుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాడు రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం అద్దంకి మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ఏ ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ రూపొందించిన గోడపత్రికలను హెల్ప్ టిఐ మేదరమెట్ల ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ గోడ పత్రికలను అన్ని ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో, ప్రాథమిక వైద్య కేంద్రాల్లో ఏర్పాటు చేయటం జరుగుతుందని హెచ్ఐవి ఎయిడ్స్ నియంత్రణంలో నిర్మలనలోనే దేశంలోని



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏడో స్థానం ఉందన్నారు. ఈ స్థాయిలో హెచ్ఐవి ఎయిడ్స్‌ను రాష్ట్రంలో నియంత్రణ చేయుటకు ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు ఎంత కృషి చేశాయన్నారు. సోషల్ మీడియా ద్వారా కళాశాలల్లో, పాఠశాలల్లో వివిధ రకాల పారిశ్రామిక కంపెనీలోని సిబ్బందికి పోలీస్, రెవెన్యూ, ఆశ, అంగన్వాడి డిఆర్డిఏ, వివిధ ప్రభుత్వ శాఖల్లోని క్షేత్రస్థాయి సిబ్బంది నుండి సిబ్బంది వరకు "మీకు తెలుసా?" వంటి అవగాహన కార్యక్రమలు నిర్వహించడం జరిగిందన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలను మంత్రి కొనియాడారు. హెల్ప్ టిఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివిని అభినందించారు. ఇదే స్ఫూర్తితో మీరు కష్టపడి పని చేస్తే మన దేశంలో హెచ్ఐవి వ్యాధిని పూర్తిస్థాయిలో నిర్మూలించడం సాధ్యమవుతుందన్నారు. మీకు అన్ని విధాల ప్రభుత్వ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో టి.చంద్రశేఖర్ నాయుడు, అద్దంకి తహశీల్దార్ శ్రీ చరణ్, హెల్ప్ టి ఐ మేదరమెట్ల ప్రోగ్రాం మేనేజర్ డి.సి.హెచ్. కోటేశ్వరావు, అద్దంకి హెల్ప్ టిఐ ఔట్రిచ్ వర్కర్స్ ఏం సామ్రాజ్యం భవాని తదితరులు పాల్గొన్నారు.

తెలుగు తల్లికి బాపట్ల పుట్టినిల్లు

మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ చక్రపాణి

ఘనంగా బాపట్ల జిల్లా ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-బాపట్ల

తెలుగు తల్లికి బాపట్ల పుట్టినిల్లు అని ఏపీ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ డి.చక్రపాణి అన్నారు. శుక్రవారం బాపట్ల జిల్లా తృతీయ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో పట్టణంలో తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో నిర్వహించిన సభకు చక్రపాణి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు జాతికి బాపట్ల జిల్లా ఆయువుపట్టు లాంటిదన్నారు. తెలుగు రాష్ట్ర అవతరణకు ఇక్కడే పునాదులు పడ్డాయన్నారు. తెలుగు సాహిత్యం ఇక్కడే ఓనమాలు దిద్దుకుందన్నారు. తెలుగు పద్యం బాపట్ల జిల్లాలోనే పుట్టిందన్నారు. తెలుగు లిపి బాపట్ల జిల్లాలోనే పురుడు పోసుకుందన్నారు. తెలుగు తల్లికి కూడా బాపట్లే



మాట్లాడుతున్న చక్రపాణి

పుట్టినిల్లు. ఆంధ్రుల చరిత్ర బాపట్ల జిల్లాలోనే ప్రారంభమైందన్నారు. ఈ విధంగా తెలుగు వారి వైభవానికి బాపట్ల ముత్యాల పందిరి వేసిందని చక్రపాణి చెప్పారు. ఆంధ్ర మహాభారతాన్ని బాపట్లకు చెందిన ఎర్రాప్రగడ గట్టెక్కించారని అద్దంకి చెందిన పద్య కవి డివిఎం సత్యనారాయణ చెప్పారు. బౌద్ధానికి పెద్దపీట వేసి, ఆచార్య నాగార్జునుడి జన్మస్థలంగా భాసిల్లుతున్నది బాపట్ల జిల్లా అని ఆయన వివరించారు. సభకు ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డబ్ల్యూ ఏ జి కే మూర్తి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చక్రపాణిని పలువురు పుర ప్రముఖులు సన్మానించారు. సభలో మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి, సుశీల కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కరస్పాండెంట్ ప్యార్లీ సునీల్ కుమార్, సెర్ప్ కార్యదర్శి సి హెచ్ పార్థసారథి, ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పి సి సాయిబాబు, తెలుగు పండితులు పరిమి సుబ్రహ్మణ్యం శాస్త్రి, విశ్రాంత రైల్వే ఉద్యోగి మానం అప్పారావు, నాయకులు ఉమ్మా రెడ్డి రామారావు, సీనియర్ సిటిజన్స్ నాయకులు జీవి బ్రహ్మం, శ్రీహరి రావు, బందా బాబు, జన విజ్ఞాన వేదిక కార్యదర్శి యాజలి భాస్కరరావు, మాజీ కౌన్సిలర్ జిట్టా కన్యాకుమారి, యోగా గురువు ధూళిపాళ్ల శైలజ, చిత్రకారుడు జీవి, సాహితీ భారతీయ అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ, మాజీ సైనికుల సంఘం నాయకులు కృష్ణారావు, విశ్రాంత తాహశీల్దార్లు సత్యనారాయణ, విశ్వేశ్వరరావు పాల్గొన్నారు .

అందరికీ విద్య మనందరి బాధ్యత

ద్విచక్ర వాహనంపై ఉపాధ్యాయుడి ప్రచారం

ప్రజాశక్తి-బాపట్ల



బైక్‌పై ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయుడు వెంకయ్య

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించండి.. అందరికీ విద్య- మనందరి బాధ్యత.. పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలలో చేర్పిద్దాం రండి.. అంటూ చుండూరు మండలం వేటపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య ద్విచక్ర వాహనంపై ప్రచారం నిర్వహిస్తున్నారు. సంచార ప్రచారంలో భాగంగా శుక్రవారం బాపట్లలో ఆయన బడి బాట ప్రచారాన్ని నిర్వహించారు. తెనాలి, గుంటూరు, బాపట్ల డివిజన్లలో ద్విచక్ర వాహనంపై పర్యటిస్తూ అవగాహన కల్పిస్తున్నారు. పట్టణంలో గడియారం స్తంభం సెంటర్, రథం బజార్లో ద్విచక్ర వాహనంపై మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత విద్య కోసం రూ. వందల కోట్లు ఖర్చు చేస్తుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హులైన ఉపాధ్యాయులు బోధన చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పోరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నారన్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కొనసాగిస్తూనే ఉచితంగా ఏకరూప దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు, బూట్లు, బెల్టులు ప్రభుత్వం అందజేస్తుందని ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో బలోపేతానికి వెంకయ్య చేస్తున్న కృషి అభినందనీయమని పలువురు పేర్కొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

రోడ్ల అభివృద్ధికి సహకరించండి

మంత్రికి ఎమ్మెల్యే నరేంద్ర వర్మ వినతి

ప్రజాశక్తి-బాపట్ల

బాపట్ల నియోజకవర్గంలో రహదారులను విస్తరించడంతో పాటు వాటి అభివృద్ధికి సహకరించాలని రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన రెడ్డిని బాపట్ల ఎమ్మెల్యే నరేంద్ర వర్మ కోరారు. శుక్రవారం మంత్రిని కలిసిన నరేంద్ర వర్మ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. బాపట్ల నుంచి పర్చూరు, చందోలు నుంచి తెనాలి, కర్లపాలెం నుంచి పెదపులుగువారి పాలెం రోడ్డు, చందోలు వంతెన నుంచి నిజాంపట్నం, భవనంవారిపాలెం నుంచి ఖాజీపాలెం వయా దమ్మన్నవారి పాలెం రహదారులను వెడల్పు చేసి అభివృద్ధి చేయాలని నరేంద్ర వర్మ ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు.

ఎంటిపి పకడ్బందీగా అమలు చేయాలి

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న విజయమ్మ

ప్రైవేటు ఆసుపత్రుల్లో మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటిపీ) నిర్వహించుటకు జిల్లాలో 5 ఆసుపత్రులకు అనుమతి పత్రాలు అందజేసే ప్రక్రియ చేపట్టాలని జిల్లా వైద్యారోగ్య అధికారి ఎస్.విజయమ్మ అన్నారు. శుక్రవారం ఎంటిపీపై బాపట్ల ఏరియా వైద్యశాలలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 12 వారాలకు ఎంటిపీ నిర్వహించుటకు గైనకాలజిస్ట్ అనుమతి తీసుకోవాలన్నారు. 20 వారాలకు ఇద్దరు గైనకాలజిస్టులను ఆసుపత్రి యాజమాన్యం నియమించుకోవాలన్నారు. వీటికి సంబంధించి జిల్లా వైద్యాధికారి అనుమతులు తప్పనిసరి అన్నారు. ఈ సమావేశంలో ఏరియా వైద్యశాల వైద్యాధికారి శ్రీరామ మూర్తి, సుజాత లక్ష్మి, సిద్ధార్థ, సాల్మన్ పాల్గొన్నారు.

కనిగిరి ఏఎంసీ ఛైర్మన్‌గా రమాదేవి

ప్రజాశక్తి-పామూరు

కనిగిరి మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా తెలుగుదేశం పార్టీ యువ నాయకులు యారవ శ్రీనివాసులు సతీమణి యారవ రమాదేవిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులిచ్చింది. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ తనకు ఈ పదవి వచ్చేందుకు సహకరించిన మంత్రులు బాలవీరాంజనేయస్వామి, గొట్టిపాటి రవికుమార్, పార్టీ జిల్లా అధ్యక్షులు నూకసాని బాలాజీ, కనిగిరి శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పామూరు పట్టణంలో తెలుగుదేశం కార్యకర్తలు బాణాసంచా కాల్చి.. స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు.



రమాదేవి

కంభం ఏఎంసీ ఛైర్మన్‌గా భూపాల్‌రెడ్డి

ప్రజాశక్తి-కంభం

కంభం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా బేస్తవారిపేట మండలానికి చెందిన సీనియర్ టిడిపి నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డిని ప్రభుత్వం నియమించింది. భూపాల్‌రెడ్డి బేస్తవారిపేట మండలంలోని ఖాజీపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచి పూనూరు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు. వెంకటసుబ్బారెడ్డి మూడు పర్యాయాలు ఉమ్మడి పంచాయితీలో బసినేపల్లి గ్రామపంచాయతీ సర్పంచ్‌గా కొనసాగారు. పంచాయతీ విభజన అనంతరం కూడా ఖాజీపురం గ్రామ సర్పంచ్‌గా ఆయన ఎన్నికయ్యారు. ఆయన రాజకీయ వారసుడిగా ఇంజనీరింగ్ విద్యను పూర్తి చేసిన భూపాల్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో 2009 నుంచి 2017 వరకు మండల పార్టీ అధ్యక్షులుగా పనిచేశారు. 2019 నుంచి ప్రస్తుతం జగ్గంబోట్ల కృష్ణాపురం ఎంపీటీసీగా కొనసాగుతున్నారు. భూపాల్ రెడ్డి సేవలను గుర్తించి స్థానిక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో పార్టీ అధిష్టానం కంభం ఏఎంసీ ఛైర్మన్ గా నియమించడంపై తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఆనందోత్సహాల మధ్య సంబరాలు చేసుకున్నారు.



భూపాల్‌రెడ్డి

మద్దిపాడు ఏఎంసి ఛైర్మన్‌గా మన్నం రాజేశ్వరి

ప్రజాశక్తి-చీమకుర్తి

మద్దిపాడు ఏఎంసీ ఛైర్మన్‌గా మన్నం రాజేశ్వరి ఎంపికయ్యారు. బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్ సతీమణి మన్నం రాజేశ్వరి ఏఎంసి ఛైర్మన్‌గా ఎంపిక కావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. మన్నం ప్రసాద్ తెలుగు దేశం పార్టీ ఆవిర్భావం నుంచి క్రమశిక్షణ గల కార్యకర్తగా, పార్టీ విధేయుడిగా పనిచేస్తున్నారు.



రాజేశ్వరి

బొమ్మరిల్లు చిన్నారులకు యూనిఫాం అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మానవత సేవాసంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు భాగ్యనగర్ నాలుగో లైన్‌లో గల బొమ్మరిల్లు అనాథాశ్రమంలో మన మానవతా సంస్థ డైరెక్టర్ శిఘాకొల్లి కనకదుర్గ ఆర్థిక సహకారంతో చిన్నారులకు స్కూల్ యూనిఫాం (నూతన వస్త్రాలు), నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ కన్వీనర్ మారెళ్ళ సుబ్బారావు మాట్లాడుతూ చిన్నారులకు నూతన వస్త్రాలు, నిత్యావసర వస్తువులను కనకదుర్గాదేవి భర్త రామకృష్ణదాస్ జ్ఞాపకార్థం మానవత్వంతో అందించారని తెలిపారు. సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు నగరంలో అంతిమయాత్ర వాహనం ఫ్రీజర్ బాక్సులు నగరంలో ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు భోజిరెడ్డి, శరభలింగాచారి, నాగలక్ష్మి, మద్దాల రాధా, రామిరెడ్డి, ఎం.సుధాకర్‌రెడ్డి, డి.చంద్రశేఖర్, దన్నారపు మస్తాన్‌రావు, కోసూరి శ్రీదేవి, సుజాత పాల్గొన్నారు.



యూనిఫాం అందజేస్తున్న దృశ్యం



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న డిటిసి సుశీల

కలెక్టర్‌కు డిటిసి అభినందనలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డు వచ్చిన సందర్భంగా శుక్రవారం నాడు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు డిటిసి ఆర్.సుశీల మొక్క అందజేసి.. అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు కిరణ్‌ప్రభాకర్, సురేంద్ర ప్రసాద్, రాంచంద్రరావు, జయప్రకాష్, భానుప్రకాష్, ధర్మేంద్ర పాల్గొన్నారు.

త్వరలో విద్యార్థినులందరికీ సైకిళ్లు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచే 'తల్లికి వందనం'
- విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అద్దంకి

త్వరలోనే అద్దంకి నియోజకవర్గ పరిధిలోని పాఠశాలల విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయనున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి తల్లికి వందనం పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకం ద్వారా ఎంత మంది చదువుకునే పిల్లలు ఉంటే వారి తల్లులకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున ప్రభుత్వం చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. అద్దంకిలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శుక్రవారం నాడు 309 మంది విద్యార్థినులకు ఉచితంగా కొత్త సైకిళ్లను మంత్రి గొట్టిపాటి రవికుమార్ పంపిణీ చేశారు. చిలకలూరిపేటకు చెందిన ఆసిస్ట్ అనే స్వచ్ఛంద సంస్థ సాయంతో సైకిళ్లను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం కార్యక్రమాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ విద్యార్థినులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయడం ద్వారా వారికి చదువుల వైపు ప్రోత్సహించినట్లవుతుందని అన్నారు. వివిధ కారణాల వల్ల పాఠశాల విద్యకు దూరమయ్యే బాలికల సంఖ్య కూడా తగ్గే అవకాశం ఉందని తెలిపారు. గతంలో ఇదే పాఠశాలలో కొంత మంది విద్యార్థినులకు సైకిళ్లు అందజేశామని చెప్పిన మంత్రి... విద్యార్థుల కోరిక మేరకు నేడు అందరికీ పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం... విద్యా వ్యవస్థకు సంబంధించి



సైకిళ్లు అందజేస్తున్న మంత్రి గొట్టిపాటి

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే ఒక రోల్ మోడల్‌గా నిలిపేందుకు అన్ని చర్యలూ తీసుకుంటుందని ఆయన వెల్లడించారు. విద్యార్థులందరూ కష్టపడి చదివి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని హితోపదేశం చేశారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ ప్రతినిధులతో పాటు విద్యా శాఖకు చెందిన అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రూ.1.38 కోట్ల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అద్దంకి పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం పరిధిలో శుక్రవారం నాడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రజా వేదికను నిర్వహించారు. అక్కడికి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 89 మంది లబ్ధిదారులకు రూ.1.38 కోట్ల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను మంత్రి గొట్టిపాటి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నేతలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

డివైఎఫ్‌ఐ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మెగా డిఎస్సీ నోటిఫికేషన్‌లో ప్రకాశం జిల్లాలో ఖాళీగా ఉన్న 167 వ్యాయామ ఉపాధ్యాయ (పిఇ) పోస్టులను భర్తీ చేయాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. శుక్రవారం నాడు స్థానిక ఎల్‌బిజి భవనంలో డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగులతో జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి కెఎఫ్.బాబు మాట్లాడారు. ప్రకాశం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్స్ (పిఇ) పోస్టుల వివరాలను పరిశీలించామన్నారు. జిల్లాలో 167 పోస్టులు వ్యాయామ విద్య ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉండగా, రాష్ట్ర ప్రభుత్వంకు జిల్లా విద్యాశాఖ అధికారులు 72 పోస్టులు మాత్రమే ఉన్నట్లు చూపారని తెలిపారు. రాష్ట్రంలో మిగిలిన జిల్లాలలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉంటే అన్ని పోస్టుల జాబితాను ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి పంపారన్నారు. కానీ



మాట్లాడుతున్న కెఎఫ్.బాబు

ప్రకాశం జిల్లాలో పోస్టులను గోప్యంగా ఉంచడం అనుమానాలకు తావిస్తోందన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ఈ జిల్లాలో ఎస్‌ఏపీఈటీలకు జరిగిన అన్యాయంపై వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే అభ్యర్థులతో ఆందోళన చేయవలసి వస్తుందన్నారు. కార్యక్రమంలో రోసిబాబు, దానియేలు, శ్రీనాథ్, రసూల్, మరియబాబు, వేణు, కుమార్, రాము, సతీష్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, నాయకులు

మున్సిపల్ కార్మికులకు 62 ఏళ్ల వయోపరిమితి వర్తింపజేయాలి

మస్టర్ పాయింట్ల వద్ద నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మున్సిపల్ కార్మికులందరికీ 62 సంవత్సరాల వయోపరిమితి పెంచాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ డిమాండ్ చేసింది. శుక్రవారం నాడు నగరపాలక సంస్థ ఐదు మస్టర్ పాయింట్ల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు ఒంగోలు నగర కార్యదర్శి టి.మహేష్ మాట్లాడుతూ పారిశుధ్య, ఇంజనీరింగ్ వివిధ విభాగాల్లో గత 20 సంవత్సరాలు నుండి కార్మికులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. గత సంవత్సరం 16 రోజుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఆప్కాస్ కార్మికులకు 62 సంవత్సరాలు వయో పరిమితి అమలు చేస్తామని, కార్మికులను రెగ్యులర్ చేస్తామని రాతపూర్వక హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, యూనియన్ నాయకురాలు కే సామ్రాజ్యం, నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, టి.విజయమ్మ, నాయకులు రత్నకుమారి, ఎం.బాబు, ఆర్.శ్రీనివాసరావు, కె.మోహన్‌రావు పాల్గొన్నారు.



ఫోన్లు తనిఖీ చేస్తున్న సిఐ శ్రీకాంత్‌బాబు

బెట్టింగులకు పాల్పడితే కఠినచర్యలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బెట్టింగులకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఒంగోలు డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు హెచ్చరించారు. బెట్టింగ్ యాప్‌లపై శుక్రవారం ఒంగోలులోని పలు చోట్ల పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బెట్టింగ్ యాప్‌ల తనిఖీలో భాగంగా యువకులు, వాహనదారుల ఫోన్‌లను చెక్ చేశారు. బెట్టింగుల వల్ల జరిగే నష్టాలపై అవగాహన కల్పించారు. 18 మంది వ్యక్తుల ఫోన్‌లలో అనుమానాస్పద యాప్స్ గుర్తించి, వారిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కార్యక్రమంలో ఒంగోలు తాలూకా సిఐ అజయ్‌కుమార్, రూరల్ సిఐ శ్రీకాంత్‌బాబు, వన్‌టైన్ సిఐ నాగరాజు, శింగరాయకొండ సిఐ హజరత్తయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాస్' ఆధ్వర్యంలో నేడు మెగా వైద్యశిబిరం

ప్రజాశక్తి-ఒంగోలు

ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నగరంలోని బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్‌లో శనివారం నాడు ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు హాస్పిటల్ డైరెక్టర్లు డాక్టర్ ఉమాపతి చౌదరి, ప్రకాష్ చవల, అనిల్‌కుమార్, అనపర్తి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంప్లెక్స్‌లోని షాప్ నెం 37-38లో ఈ శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. శిబిరంలో ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రకాష్ చవల, ప్రముఖ కార్డియాలజిస్ట్ శ్రీధర్ చివుకుల, జనరల్ సర్జన్ డాక్టర్ కె.సువర్ణరాజు, ఎండోక్రినాలజీ డాక్టర్ వి.జయవర్ధన్, యూరాలజీ, కిడ్నీ వైద్యనిపుణులు ఎన్.పవన్‌కుమార్ వైద్యసేవలందిస్తారని తెలిపారు. ఈ శిబిరంలో ఉచితంగా బీపీ, షుగర్, ఇసిజి, బోన్ మినరల్ డెన్సిటీ స్కాన్ పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. వివరాలకు 7207950543 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.



అవగాహన కల్పిస్తున్న సిఐ శ్రీకాంత్‌బాబు

చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడులోని సచివాలయంలో వద్ధులకు, వారి కుటుంబసభ్యులకు చట్టాలపై సిఐ ఎన్.శ్రీకాంత్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. సిఐ శ్రీకాంత్‌బాబు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు ఏదైనా సమస్య ఉంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌లో గానీ, 100 నెంబర్‌కు గానీ ఫోన్ చేసి.. వారి సమస్యలను తెలపవచ్చున్నారు. వృద్ధులు ఇబ్బంది పడుతున్నట్లు ఎవరి దష్టికి వచ్చినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. శక్తి యాప్‌పై మహిళలకు, మహిళా పోలీసులకు, ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, మహిళా కానిస్టేబుల్ పరమేశ్వరి, మహిళా పోలీసులు మాధురి, సౌజన్య పాల్గొన్నారు.

రైతులు ఆదాయం పొందేలా కృషి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై దష్టి సారించి ప్రతి రైతుకు ఖర్చు తగ్గించి అధిక ఆదాయం పొందేలా కృషి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్‌అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ అధికారులతో సమావేశమై ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయం, అను బంధ శాఖల్లో వద్ధి రేటు పెంచేలా తీసుకోవాల్సిన చర్య లపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి రైతుకూ ఖర్చు తగ్గించి, ఉత్పత్తి పెంచేలా అధిక ఆదాయం పొం దేలా వ్యవసాయ శాఖ అధికారులు ప్రణాళికలు రూపొం దించాలన్నారు. వ్యవసాయ రంగంలో డ్రోన్ విని యోగాన్ని ప్రోత్సహించాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్. శ్రీనివాస రావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బేబిరాణి, ఉద్యాన శాఖ అధికారి వై.గోపిచంద్, ఏపి ఎంఐపి పీడీ రమణ పాల్గొన్నారు.

ఎన్‌సిడి 3.0 సర్వే ఖచ్చితంగా నిర్వహించండి

డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎన్‌సిడి 3.0 సర్వేను కచ్చితంగా నిర్వహించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు వైద్యాధికారులను ఆదేశించారు. స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి ఛాంబర్‌లో శుక్రవారం ఒంగోలు మండలంలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులతో ఎన్‌సిడి 3.0 సర్వేపై డిఎం,హెచ్‌ఒ అధ్యక్షత సమీక్షా సమావేశం నిర్వహజంచారు. ఈ సందర్భంగా డిఎం,హెచ్‌ఒ మాట్లాడుతూ ప్రతి రోజు 30 గృహాలను సందర్శించాలని, సర్వేను కచ్చితంగా నిర్వహించి అనుమానితులను ప్రివెంట్ ఆంకాలజి యూనిట్‌కు సిఫారసు చేయాలన్నారు. సమావేశంలో వివిధ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న కళ్యాణి

టాలెంట్ టెస్టు

ప్రజాశక్తి-టంగుటూరు

డాక్టర్ బిఆర్ అంబెడ్కర్ వివాహ దినోత్సవం రోజు ఎంనిడమలూరు గ్రామ కమిటీ రియల్ స్టార్స్, అంబెడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబెడ్కర్, జ్యోతిరావు పూలె గురించి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ టాలెంట్ టెస్ట్‌కు ఒంగోలు నవోదయ, ఉప్పలపాడు పాపారావు, ఆలకూరపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల, పొందూరు, టంగుటూరు, నిడమలూరు జడ్పిహెచ్ పాఠాశాలల విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు. మొదటి బహుమతి ఆలకూరపాడుకు చెందిన పుట్ట వెంకటభార్గవి, ద్వితీయ బహుమతి నవోదయ విద్యార్థి ఎం క్రాంతి. తతీయ బహుమతి ఎం నిడమానూరు విద్యార్థి కె కౌషిక్ గెలుపొందారు. వారికి రూ.5116, రూ.3116, రూ.2116 నగదు బహుమతితోపాటు జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నిడమలూరు కళ్యాణి, ఎస్ఎంసి చైర్మన్ పిడుగురాళ్ల సురేష్ బాబు, సర్పంచ్ పిడుగురాళ్ల వెంకట శేషమ్మ, రిటైడ్ డిప్యూటీ కలెక్టర్ పిడుగురాళ్ల బాలకష్ణ, పశువైద్యాధికారి ధనలక్ష్మి, జమ్ములపాలెం పిఇటి తుల్లిబిల్లి అశోక్ పాల్గొన్నారు.

జెడ్ స్కేలార్ టెక్‌పై అవగాహన

ప్రజాశక్తి-టంగుటూరు

స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం ఎడ్యు స్కిల్స్ సహకారంతో జెడ్ స్కేలార్ టెక్ క్యాంప్ పేరుతో మూడు రోజులు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ వర్క్ షాప్‌కు రిసోర్స్ పర్సన్‌గా హైదరాబాదు జడ్ స్కేలార్ సీనియర్ లీడ్ ట్రైనర్‌గా సాయి వెంకట్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్క్ షాప్‌లో విద్యార్థులకు జెడ్ స్కేలార్ జీరో ట్రస్ట్ క్లౌడ్ సెక్యూరిటీ పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ ఇలాంటి టెక్ క్యాంపులు వలన విద్యార్థులకు ఎంతో నైపుణ్య అభివద్ధికి ఉపయోగపడతాయని తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డీన్ డాక్టర్ సివి సుబ్బారావు, డీన్ ఆఫ్ అడ్మిషన్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు, డీన్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ కె రూప అక్కేష్, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్ గిరిబాబు, కె రాజ్ కిరణ్, డి జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కదిరి పార్థసారథి

జాతీయ స్పోర్ట్స్ మీట్‌కు వ్యవసాయ కళాశాల విద్యార్థులు

ప్రజాశక్తి-సిఎస్.పురం

ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి వ్యవసాయ కళాశాలల క్రీడా పోటీల్లో మొదటిస్థానంలో రాణించి జాతీయ స్థాయిలో స్పోర్ట్స్ మీట్‌కు కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అయోధ్యలో మే నెల 2 నుండి 5వరకు జరిగే ఆల్ ఇండియా వ్యవసాయ విశ్వవిద్యాలయ క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె యమున, తృతీయ సంవత్సరం విద్యాంర్థి మునయ్య, ఎస్ సుదేవును సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారథి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ పి వీరన్నగౌడ్, కెవిఎన్ఎల్ ప్లస్ కళాశాల చైర్మెన్ ఇరగని చలపతిరావు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుస్మిత, ఫిజికల్ మాస్టర్ బండారు రవీంద్రబాబు, డి మాలకొండయ్య పాల్గొన్నారు.

'పనులు చేయకుండానే బిల్లులెలా డ్రా చేస్తారు?'

ప్రజాశక్తి-సిఎస్.పురం

గ్రామాల్లో పనులు చేయకుండానే మండల పరిషత్ నిధుల నుండి బిల్లులు ఎలా మార్చుకుంటారని, కనీసం ఎం బుక్కులు, తీర్మానాలు లేకుండానే పనులు ఎలా చేపడతారని అరివేముల ఎంపిటిసి డాక్టర్ బొమ్మనుబోయిన వెంకటేశ్వర్లు సభలో ధ్వజమెత్తారు. గ్రామాల్లో రోడ్లు వేయకుండానే రోడ్లు వేసినట్టుగా నిధులు డ్రా చేశారని, దానికి సంబంధించిన ఎంబుక్‌లన్ని తమ వద్ద ఉన్నాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి స్పందిస్తూ పనులు చేయకుండా, తీర్మానాలు లేకుండా ఎలా బిల్లు డ్రా చేశారని, ఎంపిపి మూడుమంచి వెంకటేశ్వర్లును ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రజల సొమ్ము దోచుకోవడం సరైన పద్ధతి కాదని, దోచుకోవడానికి పదవుల్లోకి వచ్చారా అంటూ ఎంఎల్ఏ ప్రశ్నించారు. నిధులు దుర్వినియోగం చేస్తే జైలుకెళ్లడం ఖాయమని హెచ్చరించారు. కనీసం ఎంపీపీ గ్రామంలో కూడా రోడ్లు వేయకుండా బిల్లులు డ్రా చేశారంటే గత ప్రభుత్వ పాలన ఏవిధంగా ఉందో అర్థమవుతుందన్నారు. గుంతచిన్నంపల్లిలో రెండేళ్ల క్రితం బోర్లలోని పైపులు తీసుకువెళ్లారని, ఇంతవరకు ఆ బోర్లలో సామాగ్రి ఎక్కడున్నదో తెలియడం లేదని అన్నారు. నీటి కూడా ఇబ్బందికరంగా ఉన్నదని గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత మెకానిక్‌ను పిలిపించి మందలించారు. ఆ బోర్ల సామాగ్రి ఎక్కడుందో తీసుకొచ్చి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

వెంటనే బోర్లు బిగించాలని ఆదేశించారు. రేగులచిలుక, చెర్లోపల్లి ప్రాథమిక పాఠశాలలు పూర్తి శిథిలావస్థకు చేరాయని, ఎన్నిసార్లు సమావేశాల్లో ప్రశ్నించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని సభలో వెంగయ్య ప్రస్తావించారు. ఏ కొత్తపల్లి సచివాలయానికి కరెంటు కోసం ఏడాది క్రితం దరఖాస్తు చేసిన కరెంటు ఇవ్వడంలో అధికారులు జాప్యం చేస్తున్నారని సర్పంచ్ శ్యామలమ్మ, గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకవచ్చారు. పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్యను పిలిపించి అడగ్గా జాప్యం జరగడంపై ఎమ్మెల్యే మండిపడ్డారు. ఆనికాలపల్లెలో అంగన్‌వాడి బిల్డింగ్ మరమ్మతులు చేసి రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు బిల్లులు ఇవ్వలేదని సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి విన్నవించుకున్నారు. సిఎస్ పురం, ఆర్‌బికె ముందు మందు పార్టీలు ఎక్కువగా జరుగుతున్నాయని, గతంలో ఇక్కడ పని చేసిపోయిన సిబ్బంది ఇక్కడికి వచ్చి పార్టీలు జరుపుతున్నారని గ్రామానికి చెందిన బొబ్బూరి రమేష్ చెప్పారు. ఆధారాలు సేకరించి అట్టి వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డిజి పేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం కింద పశువుల త్రాగునీటి కోసం 501 నీటితొట్లు మంజూరైనట్లు ఎపిఓ శ్రీనివాస నాయక్ తెలిపారు. ఉప్పలపాడులో అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు లేవని చెరుకుపల్లి వెంకటరెడ్డి చెప్పారు. ఎస్టీ కాలనీలో 30 కుటుంబాలకు ఒకే ఒక చేతిపంపుతో నీటికి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిఎస్‌పురం బస్టాండ్ సెంటర్‌లో స్వచ్ఛ భారత్ కింద రూ.30 లక్షలు, భైరవకోనలో రూ.18 లక్షలు టాయిలెట్స్ నిర్మించినట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇ మోహన్‌రావు తెలిపారు. జల జీవన్ మిషన్ ద్వారా గ్రామాల్లో పనులు పూర్తయ్యాయని ఆయన సభలో ప్రస్తావించగా ఆనికాలపల్లిలో ఇంతవరకు పనులు పూర్తికాలేదని సర్పంచ్ రాధాకృష్ణారెడ్డి చెప్పడంతో ఎమ్మెల్యే అధికారిపై మండిపడ్డారు. పనులు పూర్తికాకుండానే పూర్తి చేశారని చెప్పడం సబబు కాదని హెచ్చరించారు. ఎంపిపి మూఢమంచు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి కోసం, విద్యుత్ సమస్యల కోసం ఏవైనా నిధులు అవసరమైనట్లయితే తమ దృష్టికి తీసుకు వస్తే మండల పరిషత్ నిధుల నుంచి కేటాయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఓ బ్రహ్మయ్య, డిప్యూటీ తశీల్దార్ వెంకటేశ్వర్లు, గొర్రెల సహకార సంఘం జిల్లా అధ్యక్షులు తోడేటి గోపి, డిఎల్‌డిఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్ డిఇ విశ్వనాథ్‌రెడ్డి, దుగ్గిరెడ్డి ప్రతాపరెడ్డి, భూమిరెడ్డి ప్రభంజనరెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిషేధంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ దమ్ము వెంకటయ్య

ప్రజాశక్తి - కనిగిరి

మండల పరిధిలోని ఏరువారిపల్లి సచివాలయంలో సర్పంచ్ దమ్ము వెంకటయ్య అధ్యక్షతన బంగారు బాల్యం, మిషన్ శక్తి కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. బంగారు బాల్యం అనే కార్యక్రమానికి జాతీయ స్థాయిలో స్కోచ్ అవార్డు అందుకున్న కలెక్టర్ తమీమ్ అన్సారీయాకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నెలలో పెళ్లి ముహూర్తాలు ఉన్నందున బాల్య వివాహ నిషేధ చట్టంపై అవగాహన కలిగించాలని సూచించారు. గ్రామంలో 10వ తరగతి పూర్తయిన బాలలందరూ ఈ నెలలో 7వ తేదీ తర్వాత ఇంటర్మీడియట్ కళాశాలలో చేరాలని, అలాగే కమిటీ బాధ్యత తీసుకోవాలని కోరారు. బాలల ఆరోగ్యం కొరకు పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ బెల్ కార్యక్రమంపై అవగాహన కలిగించాలని అన్నారు. 10 తర్వాత 11వ తరగతి పెళ్లి కాదనే నినాదంతో గ్రామంలో ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో బంగారు బాల్యం కమిటి సభ్యులు, ప్రధానోపాధ్యాయురాలు మహబూబ్ ముంతాజ్, మహిళా పోలీసు వి సుస్మిత, ఎఎన్ఎం ఎం శ్రావణి, విఓఎ అనూష, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు కుమారి, శ్రీదేవి, దేవమ్మ, ఆశా కార్యకర్తలు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ప్రతినిధులు ధనరాజ్, శివ, 10వ తరగతి విద్యార్థులు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టంగుటూరు : మండలంలోని తూర్పు నాయుడుపాలెం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో బాలల బంగారు బాల్యం భాగంగా అవగాహన సదస్సు ప్రధానోపాధ్యాయురాలు ఎన్‌వి సుధారాణి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ చంద్రలీల, షాట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఎన్ స్వప్న బాలికలకు గుడ్ టచ్ బాడ్ టచ్, బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల భద్రతపై ప్రవేశపెట్టిన పలు రకాల ఆన్ లైన్ సేవలు, టోల్ ఫ్రీ నెంబర్లను తెలిపారు. సమావేశంలో పాఠశాల సిబ్బంది కె మాధురి, ఎ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి వివరిస్తున్న కళ్యాణి



వేలం నిర్వహిస్తున్న నిర్వహణాధికారి జి సునీల్ కుమార్

180 బేళ్లు తిరస్కరణ

ప్రజాశక్తి-కొండపి

స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 99 బేళ్లు తిరస్కరణకు గురయ్యాయని వేలం నిర్వహణ అధికారి జి సునీల్ కుమార్ తెలిపారు. క్లస్టర్ పరిధిలోని చవటపాలెం, దాదానాయుడుపాలెం, రామాయపాలెం,కొండపి, దాసిరెడ్డిపాలెం, పోలిరెడ్డిపాలెం గ్రామాలకు చెందిన రైతులు వేలానికి 491 బేళ్లను తీసుకుని వచ్చారు. వాటిలో 392 బేళ్లు కొనుగోలయ్యాయి. పొగాకు గరిష్ట ధర కేజీ రూ.280, కనిష్ట ధర కేజీ రూ.240, సరాసరి ధర కేజీ రూ.257.47గా నమోదైంది. వేలంలో 15 కంపెనీలు చెందిన వ్యాపారులు పాల్గొన్నారు.

టంగుటూరు : స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన వేలంలో 81 బేళ్ళు తిరస్కరించినట్లు వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. రైతులు నాణ్యమైన పొగాకును తీసుకురావాలని రైతులకు సూచించారు. కారుమంచి గ్రామానికి చెందిన రైతులు 445 బేళ్ళను అమ్మకానికి తీసుకు వచ్చారు. అందులో 364 బేళ్ళను వ్యాపారులు కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 81 బేళ్ళను తిరస్కరించారు. పొగాకు కేజీ అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర కెజీ రూ.240, సరాసరి కేజీ ధర రూ.266.44 పలికింది. వేలంలో 12 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతి నిధులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ప్రారంభించాలని వినతి

ప్రజాశక్తి-టంగుటూరు

ఆధార్ కేంద్రాలు ప్రారంభించాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తహశీల్దారు జి ఆంజనేయులు, ఎంపిడిఒ దేవసేన కుమారికి టంగుటూరు మాజీ ఎంపిటిసి, కాంగ్రెస్ నాయకులు బొడ్డు సతీష్ శుక్రవారం వినతి పత్రం ఇచ్చారు. గత 5 నెలలుగా ఆంధ్రా బ్యాంక్, పోస్టాఫీస్ నందు నడుపబడుతున్న ఆధార్ కేంద్రాలు పనిచేయడం లేదని అన్నారు. ఫలితంగా మండలంలోని 18 గ్రామాల ప్రజలు ఒంగోలు వెళ్ళలేక తీవ్ర ఇబ్బంధులు పడుతున్నారని అన్నారు. రేషన్ కార్డు ఈకేవైసీ చేయించుకోవాలన్నా ఇబ్బందులకు గురవుతున్నారి తెలిపారు. తక్షణమే టంగుటూరులో ఆధార్ కెంద్రాలను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రజల ఇబ్బందులను గుర్తించి యుద్ధ ప్రాతిపధికన ఆధార్



తహశీల్‌దార్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేంద్రాలు ప్రారంభించాలని, లేని పక్షంలో ఆందోళన చేయాల్సి వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో క్యాంగ్రెస్ సీనియర్ నాయకులు కాకర్లపూడీ వేణు, పైనం మధు, బిసీ సెల్ నాయకులు ఈమని కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వ్యవసాయేతర పనులకు నిధులు

ప్రజాశక్తి-కొండపి

మండలంలోని అన్ని పంచాయతీల్లో ఎన్‌ఆర్‌జిఎస్ ద్వారా వ్యవసాయ అనుబంధ పనులకు నిధులు మంజూరైనట్లు ఎంపిడివో రామాంజనేయులు తెలిపారు. 2025–2026 ఆర్థిక సంవత్సరంలో రాబోయే మూడు నెలల్లో పశువుల నీటితొట్లు 30, రైతుల పొలాల్లో పంట కుంటలు 285 (పంచాయతీకి 15చొప్పున) మంజూరైనట్లు తెలిపారు. పంటకాలువలు పూడికతీత, కొత్త పంట కాలువలు తీయుట (100 కిలోమీటర్లు), ఇరిగేషన్ చెరువుల్లో పూడికతీత పనులు చేపట్టుటకు 2.70వేల పనిదినాలకు రూ.8.10కోట్లు మంజూరైనట్లు తెలిపారు.

ప్రజాశక్తి
శనివారం 5 ఏప్రిల్ 2025

'పల్లె పండుగ' పనులకు గ్రహణం

బిల్లులు చెల్లింపులో ప్రభుత్వ తీవ్ర నిర్లక్ష్యం

అప్పుల పాలవుతున్న కాంట్రాక్టర్లు

ప్రజాశక్తి-రేపల్లె

వైసిపి హయాంలో అభివృద్ధి కుంటుపడిందని గగ్గోలు పెట్టిన టిడిపి, కూటమి నేతలు పల్లెపండుగ పనులను సకాలంలో పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో మెటీరియల్ కాంపొనెంట్ పనులు చేసేందుకు గతేడాది నవంబర్‌లో ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. చివరికి బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో పనులు చేపట్టేందుకు టిడిపి కూటమి నేతలు ముందుకు రావడం లేదు. దీంతో ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో 50 శాతం కూడా ఖర్చు చేయని దుస్థితి ఏర్పడింది. రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ రేపల్లెకు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఆయన గతంలోనే రేపల్లెకు చాలా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఏదో ఒక పేరుతో గ్రామపంచాయతీలకు నిధులు తీసుకువస్తున్నారు. అయితే అవి ఖర్చు చేసి పంచాయతీల్లో రోడ్లు పనులు పూర్తి చేస్తేనే అభివృద్ధి కనిపిస్తుంది. ప్రభుత్వం దగ్గర నిధులు లేకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. మంత్రి చొరవ తీసుకుని పల్లె పండగ ద్వారా మంజూరైన నిధులన్నీ ఖర్చు చేయించి బిల్లులు చెల్లించాలని తెలుగు తమ్ముళ్లు కోరుతున్నారు.

రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో పనులు ఇలా..

రేపల్లె మండలంలో పల్లెపనులు ఫేజ్1లో 23 పనులకు



రేపల్లెలోని ఇంజినీర్ కార్యాలయం

గాను 3.25 కోట్లు, నగరం మండలంలో 23 పనులకు గాను రూ.3.06 కోట్లు, నిజాంపట్నం మండలంలో 14 పనులకు గాను రూ.85 లక్షలు, చెరుకుపల్లి మండలంలో 14 పనులకు గాను రూ.2 కోట్లు పల్లెపండగ పనులు మంజూరయ్యాయి. ఈ పనులకు ప్రభుత్వం రూ.9.70 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు సుమారు 70 పనులు పూర్తయ్యాయి. వీటి కోసం రూ.9.70 కోట్లు ఖర్చు చేశారు. ఇప్పటివరకు 70 పనులకు రూ.9.70 కోట్ల బిల్లులు అప్‌లోడ్ చేసినప్పటికీ బిల్లులు మాత్రం 50 శాతం కూడా జమ చేయలేదని టిడిపి కూటమి నాయకులు చెబుతున్నారు.

అలాగే ఫేజ్2లో రేపల్లె మండలం 28 పనులకు గాను రూ.2.22 కోట్లు, నగరం మండలం 23 పనులకు గాను రూ.2.10 కోట్లు, నిజాంపట్నం మండలం 15 పనులకు గాను రూ.2.15 కోట్లు, చెరుకుపల్లి మండలం 13 పనులకు గాను రూ.1.59 కోట్లు పల్లెపండగ పనులు 79 మంజూరయ్యాయి. ఈ పనులకు ప్రభుత్వం రూ.8.49 కోట్లు మంజూరు చేసింది. ఇప్పటి వరకు సుమారు 79 పనులకు గాను అరకొరగా పనులు ప్రారంభమయ్యాయి. పల్లె పండుగ పనులు ప్రారంభించి నాలుగు నెలలు కాలమైనప్పటికీ బిల్లులు సకాలంలో అందకపోవటంతో కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే పూర్తి అయిన పనులకు వంద శాతం బిల్లులు చెల్లింపు జరగదని, మొత్తం బిల్లులో 15 శాతాన్ని డిపాజిట్గా ఉంచుకొని, క్వాలిటీ చెక్ చేసిన అనంతరం డిపాజిట్గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేయడం జరుగుతుందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

అప్పులపాలవుతున్న కాంట్రాక్టర్లు..

పల్లె పండుగ అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్లు అప్పుల పాలవుతున్నారు. అధిక వడ్డీలకు అప్పులు చేసి రోడ్లు, కాలువల నిర్మాణం చేపడితే బిల్లులు చెల్లించకపోవడంతో చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్‌లో రెండు విడతల్లో బిల్లులు చెల్లించారు. తర్వాత బిల్లులు మంజూరు చేయడం లేదు. ఆర్భాటంగా పనులను ప్రారంభించిన ప్రభుత్వం బిల్లుల చెల్లింపులో నిర్లక్ష్యం వహించడంతో కాంట్రాక్టర్ల అవతారమెత్తిన టిడిపి కూటమి నాయకులు కారాలు మిరియాలు నూరుతున్నారు. ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని టిడిపి కూటమి నేతలు కోరుతున్నారు.

ప్రభుత్వం నిధులు మంజూరు చేయగానే ఆగిపోయిన పనులు ప్రారంభిస్తామని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి రామారావు తెలిపారు. ఇప్పటివరకు ఫేజ్ వన్‌లో దాదాపు పదికోట్ల రూపాయలు పనులు పూర్తి చేశామన్నారు. ఫేజ్2లో పనులు జరుగుతున్నాయన్నారు. మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో త్వరలోనే బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు.

విశ్వబ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అద్దంకి

బాపట్ల జిల్లా విశ్వబ్రాహ్మణ (విశ్వకర్మ) సంఘ ప్రధాన కార్యదర్శిగా ఆళ్లగడ్డ వీర సుందరాచారి, గౌరవ సలహాదారులుగా గొళ్ళపాటి శ్రీనివాసాచారి, ఉపాధ్యక్షులుగా కొండముది రమేష్, కార్యదర్శిగా గుండెమెడ వెంకటేశ్వర్లును నియమించారు. పట్టణంలోని అడిటి రామారావు షాపింగ్ కాంప్లెక్స్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కొండపర్తి రాజశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులను ఘనంగా సన్మానించారు. బాపట్ల జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులుగా కొండముది బంగారు బాబు నియమించడం అభినందనీయమన్నారు. రాజకీయ పార్టీలు గుర్తించి విశ్వబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పిస్తూ నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని రాజశేఖర్ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పొన్నపల్లి మల్లికార్జున, బొప్పోడి వీరప్పయ్యచారి, ఎం.వీరాచారి, కనక రత్నాచారి, మల్లవరపు విశ్వరపాచారి, ముత్తులూరి హరిబాబు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సమాఖ్య సేవా సంఘం కార్యదర్శిగా ఆంజనేయులు

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రాష్ట్ర బ్రాహ్మణ సమాఖ్య సేవా సంఘ కార్యదర్శిగా చెరుకుపల్లికి చెందిన రావూరి ఆంజనేయులు ఎంపికయ్యారు. మండల బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షులుగా, గోవాడ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం బ్రాహ్మణ అన్నదాన సత్రం అధ్యక్షులుగా, డాక్యుమెంట్ రైటర్‌గా, కరణంగా, విశ్రాంత వీఆర్ఓగా మండల ప్రజలకు సుపరిచితులైన రావూరి ఆంజనేయులు జిల్లాస్థాయిలో బ్రాహ్మణ సేవా సమితి కార్యవర్గంలో కొనసాగుతూ రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం అభినందనీయమని మండల బ్రాహ్మణ సేవా సమితి సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. తన నియామకానికి కృషి చేసిన కమిటీ సభ్యులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సభ్యులు చావలి శ్రీధర్ శర్మ ,మల్లెల కృష్ణమూర్తి, నూతలపాటి భాను, రంగనాథచార్యులు, అచ్యుతుని మణి, అన్నదానామ్ సత్యనారాయణ, పీవీఎస్ ఆంజనేయ శర్మ, బొమ్మిడి శ్రీనివాసరావు, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకం

వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి అశోక్ బాబు

ప్రజాశక్తి-వేమూరు

వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు తెలిపి తెలుగుదేశం పార్టీ అధినేత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మరోసారి మైనార్టీలను తీవ్రంగా మోసం చేశారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు ఆరోపించారు. శుక్రవారం వేమూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు మైనార్టీలకు అండగా ఉంటానని హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్న చంద్రబాబు నాయుడు పార్లమెంటులో మైనార్టీలకు వ్యతిరేకంగా రూపొందించిన వక్ఫ్ బోర్డు బిల్లుకు మద్దతునిచ్చారన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం మైనార్టీలను అణగదొక్కే రీతిలో చట్టాలు చేసుకుంటూ పోతుందని, దానికి తందానా అంటూ తెలుగుదేశం పార్టీ కూడా మైనార్టీలను మోసగించి మద్దతునివ్వటం ఆందోళన కలిగిస్తుందన్నారు. చంద్రబాబు రెండు నాలుకల ద్వారా విధానాన్ని మైనార్టీలు అర్థం చేసుకోలేక గత ఎన్నికల్లో మద్దతునిచ్చారని, వక్ఫ్ సవరణ బిల్లు రాజ్యాంగానికి వ్యతిరేకంగా జరిగిందని ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో బిల్లు ముసుగులో కూటమి ప్రభుత్వం విభజన బీజాలు నాటుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. వైసీపీ తొలి నుంచి మైనార్టీలకు అండగా ఉంటూ వక్ఫ్ బోర్డ్ బిల్లును ఎట్టి పరిస్థితుల్లో సమర్ధించబోమని చెప్పిన విధానాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. రాబోయే రోజుల్లో తెలుగుదేశం పార్టీ కోటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అశోక్ బాబు హెచ్చరించారు.

పట్టుదలతో ఉన్నత శిఖరాలను అందుకోవాలి

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, చీరాల బీటెక్ డేటా సైన్స్ విభాగం ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు డేటా సైన్స్ విభాగ విద్యార్థులు వీడ్కోలు సభ నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణా రావు, కరస్పాండెంట్ యస్. లక్ష్మణరావు సంయుక్తముగా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కె. జగదీశ్ బాబు మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో కృషి చేసి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. డేటా సైన్స్ విభాగాధిపతి కె.సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు కృషి, పట్టుదల, క్రమశిక్షణతతో కెరియర్‌లో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జరిగిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా డేటా సైన్స్ విభాగము మూడో సంవత్సరం విద్యార్థులు ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశారు. ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తమయొక్క సందేశాలను అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సిఎస్ రావు, డైరెక్టర్ అక్రిడిటేషన్స్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ఆర్.వి. రమణమూర్తి, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

రీసర్వేకు సహకరించాలి

ప్రజాశక్తి-ఇంకొల్లు

భూమి యజమానుల రీసర్వేకు సహకరించాలని తహశీల్దార్ వెంకటరత్నం అన్నారు. ఇంకొల్లు పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన భూముల రీ సర్వే సదస్సు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 200 నుంచి 250 ఎకరాల వరకు ఒక బ్లాక్ ఏర్పాటు చేసి ఆ బ్లాక్ పరిధిలో ఒక రెవిన్యూ టీం ఏర్పాటు చేసి ఆ టీం ద్వారా భూముల సర్వే కొలతలు చేస్తారని తెలిపారు. బ్లాక్ పరిధిలో ఉండే అందరి రైతులతోనూ వాట్సప్ గ్రూపు ఏర్పాటు చేసి అందులో భూముల రీసర్వేకు సంబంధించిన విషయాలు తెలియజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సచివాలయాల సర్వేయర్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

పర్చూరు: భూములు రీ సర్వే చేయించుకోవాలని రెవిన్యూ సిబ్బంది పేర్కొన్నారు. మండలంలోని వీరన్నపాలెం గ్రామంలో మీ భూమి-మీ హక్కు, మీ భూమికి-మీ పేరు ప్రతి భూమికి సరిహద్దులు, ప్రతి భూమికి రికార్డులు అనే దానిపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సభ నిర్వహించారు. వీరన్నపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద నుండి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డి.టి. అరుణ, మండల సర్వేయర్ బాలాంజనేయులు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ సిబ్బంది, గ్రామప్రజలు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలంలో లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే నరేంద్ర వర్మ అందజేశారు. కర్లపాలెం మండలం తుమ్మలపల్లి గ్రామానికి చెందిన నక్కల గోపిచంద్‌కు రూ.3,24,082, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన మల్లారపు వాసుదేవరావుకు రూ.1,38,243, పేరలి గ్రామానికి చెందిన దబ్బకూటి నాగయ్యకు రూ.60 వేలు, గణపవరం గ్రామానికి చెందిన గూడూరి శేషగిరిరావుకు రూ.50,524, కర్లపాలెం గ్రామానికి చెందిన షేక్ జమిల్లా బేగంకి రూ.47,567ల చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంటు ఉపాధ్యక్షులు నక్కల వెంకట స్వామి, మండల కన్వీనర్ ఏపూరి భూపతిరావు, ముద్దిబోయిన బుల్లయ్య, మండల టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శరణ్యను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు చేతిరాత పోటీలు

ప్రజాశక్తి-అద్దంకి

పట్టణ, మండల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు కాకానిపాలెంలోని ఎలిమెంటరీ పాఠశాలలో చేతిరాత పోటీలు నిర్వహించారు. జిఎస్ఆర్ చేతిరాత మరియు స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన ఈ పోటీల్లో మండల పరిధిలోని పాఠశాలల నుంచి 300 విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జి.ఎస్ ఆర్ హ్యాండ్ రైటింగ్ అండ్ స్పోకెన్ ఇంగ్లీష్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ పోటీలలో తెలుగు విభాగం నుంచి జూనియర్స్ అండ్ సీనియర్స్‌లలో ఆరుగురిని అలాగే ఇంగ్లీష్ విభాగంలో జూనియర్స్ అండ్ సీనియర్స్‌లలో ఆరుగురిని మొత్తం 12 మందిని విజేతలుగా నిర్ణయించి వారికి షీల్డ్‌తో పాటు ప్రశంసాపత్రాలను అందించారు. డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలలో మంచి నైపుణ్యంతో వ్రాయగలిగేలా విద్యార్థిని విద్యార్థులను తీర్చిదిద్దుతామన్నారు. తెలుగులో మొదటి బహుమతి 1వ తరగతి విద్యార్థి తోడ శరణ్య గెలవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ పేపర్ వాల్యుయేషన్ ఆరుగురు ఉపాధ్యాయుల చేతుల మీదుగా జరిగింది. ఈ చిన్నారి అద్దంకి పట్టణంలోని కృష్ణవేణి స్కూల్‌లో ఒకటో తరగతి చదువుతోంది. ఈ కార్యక్రమంలో పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు, చక్రాయపాలెం హెచ్ఎం కోట శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి వెంకటేశ్వర్లు, తంగా శ్రీనివాసరావు, ఎం.లక్ష్మీనారాయణ రెడ్డి, టి.జాషువా, బి.కోటి, కె.రాజు, ఎస్.సాయి, దీప్తి శ్రీ, అనిత, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఉచిత రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి-యద్దనపూడి

పేదలు ప్రభుత్వ భూమిలో తేది.15.10.2019 ముందు నుంచి నివాసం ఏర్పాటు చేసుకొని ఉంటే వారికి ప్రభుత్వమే ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇస్తుందని తహశీల్దార్ రవి కుమార్ తెలిపారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా 150 చదరపు గజాలు మించి 450 గజాలు లోపు ఉంటే కొద్దిపాటి రుసుముతో రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ పథకం 31 డిసెంబరు 25 వరకు అమలులో ఉంటుందన్నారు. అర్హులు తగిన ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకున్న 30 రోజులలో పరిశీలించి అర్హులైన వారికి రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందన్నారు.

ఎస్సీలకు ఎన్ఎస్ఎఫ్‌డిసి ద్వారా రుణాలివ్వాలి

కెవిపిఎస్ డిమాండ్



మాట్లాడుతున్న రఘురాం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఎస్సీలకు ఎన్ఎస్ఎఫ్‌డిసి ద్వారా లబ్ధి దారులకు నేరుగా రుణాలు అందివ్వాలని కెవిపిఎస్ డిమాండ్ చేసింది. శుక్రవారంనాడు ఎల్ బిజి భవన్‌లో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు జవ్వాజి రాజు అధ్యక్షతన జరిగిన జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రఘురాం మాట్లాడారు. ఏప్రిల్ మాసంలో సామాజిక రథసారథుల జయంతి కార్యక్రమాలు నిర్వహించే మాసంగా ఉన్నప్పటికీ కార్యక్రమాల నిర్వహణపై నేటికీ దళిత ప్రజా సంఘాలతో కలెక్టర్ ఆధ్వర్యంలో సమావేశం జరగకపోవడం బాధాకరమని వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని దళిత ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు, జిల్లా ఉపాధ్యక్షులు వి. మోజేష్,టి. రామారావు తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల హక్కుల కోసం ఉద్యమించాలి

సిపిఎం ఆధ్వర్యంలో కరపత్ర ప్రచారం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

వక్ఫ్ సవరణ చట్టం పేరుతో మైనారిటీల హక్కులను హరించేందుకు కేంద్రం యోచిస్తోం దని, వక్ఫ్ ఆస్తుల పరిరక్షణకు నిర్దేశించిన చట్టాన్ని కాపాడుకునేందుకు మైనారిటీలు అందరూ ఐక్యం కావాలని సిపిఎం నాయకులు సూచించారు. హిందుత్వ అజెండాతో ముస్లిం లపై విద్వేషాలు రెచ్చగొట్టే చర్యలకు వ్యతి రేకంగా ప్రజల్ని కూడగట్టాలని పేర్కొన్నారు. శుక్రవారం నాడు లౌకిక విలువలు, మైనారిటీ హక్కులు హరిస్తున్న వక్ఫ్ సవరణలకు వ్యతి రేకంగా సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఇస్లాంపేట, గాంధీనగర్ ప్రాంతాల్లో కరపత్ర ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర కార్యదర్శివర్గ సభ్యులు తంబి శ్రీని వాసులు, పార్టీ సీనియర్ నాయకులు ఎండి యాసిన్



కరపత్ర ప్రచారం చేస్తున్న సిపిఎం నాయకులు

మాట్లాడుతూ హిందుత్వ మతోన్మాద ఎజెండా అమల్లో భాగంగా బిజెపి ప్రభుత్వం ముస్లిం ప్రజలపై విద్వేషాన్ని చిమ్ముతూ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. లవ్ జిహాద్, కామన్ సివిల్ కోడ్, వంటి చట్టాలను అమలు చేస్తూ విద్వేషాలు రెచ్చగొడుతుందని విమర్శించారు. మరోవైపు మసీదు విధ్వంసాలు, మూక హత్యలతో హిందుత్వ శక్తులు అరాచకం సష్టిస్తున్నట్లు దుయ్యబట్టారు. ఇప్పుడు కొత్తగా వక్ఫ్ సవరణ చట్టం ద్వారా ముస్లిముల ధార్మిక, సామాజికంగా, సాంస్కృతి సంస్థలపై దాడి తలపెట్టిందని ఆరోపించారు. లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న టిడిపి, జనసేనతో సహా మరికొన్ని పార్టీలు తమ స్వార్థ ప్రయోజనాల కోసం వక్ఫ్ సవరణ చట్టాన్ని బలపరచటాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ముస్లిం మైనార్టీ హక్కుల కోసం జరిగే పోరాటాల్లో సిపిఎం పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు టి .మహేష్, జిలానీభాషా, ఎస్కె పీర్, జబ్బర్ పాల్గొన్నారు.

అకాల వర్షంతో

విద్యుత్ శాఖకు భారీ నష్టం

యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేసిన విద్యుత్ సిబ్బంది

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలో గురువారం సాయంత్రం కురిసిన అకాల వర్షం విద్యుత్ శాఖను ఉలిక్కిపడేలా చేసింది. గాలివాన, మేఘగర్జనలతో కూడిన వర్షానికి వాదంపల్లి, అమానుగుడిపాడు, అయ్యాంబోట్లపల్లి గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో ఉన్న 15 విద్యుత్ స్తంభాలు, ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు నేలకూలాయి. ఫలితంగా ఆ గ్రామాలన్నీ చీకట్లో మునిగిపోయాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయిన వెంటనే నీటి పంపింగ్ వ్యవస్థ కూడా నిలిచిపోయింది. దీంతో ప్రజలు త్రాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. యర్రగొండపాలేనికి సాగర్ నీటిని విడుదల చేయాల్సిన పైపులైన్‌కు విద్యుత్ సరఫరా చేసే ట్రాన్స్‌ఫార్మర్ సైతం నేలమట్టమైంది. దీంతో శుక్రవారం యర్రగొండపాలెం పట్టణానికి సరఫరా చేయాల్సిన సాగర్ నీరు నిలిచిపోయింది. ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విద్యుత్ శాఖ మండల ఏఈ తలపాటి అల్లూరయ్య నేతత్వంలో విద్యుత్ సిబ్బందిని రంగంలోకి దించి సాయంత్రానికి యుద్ధప్రాతిపదికన 15 విద్యుత్ స్తంభాలను, ఐదు ట్రాన్స్‌ఫార్మర్లను తిరిగి యధాస్థానంలో ప్రతిష్ఠించారు. జోరుగా సాగిన పనులు సాయంత్రం వరకు



నేలకొరిగిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కొనసాగాయి. చివరికి గ్రామాలకు మళ్లీ విద్యుత్ వెలుగు పునరాగమించింది. దీంతో నీటి పంపింగ్ వ్యవస్థ కూడా పునరుద్ధరించబడింది. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ అల్లూరయ్య మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు విద్యుత్ స్తంభాల దగ్గర నిలబడడం, వాటిని పట్టుకోవడం లాంటివి చేయకూడదన్నారు. పిడుగులు పడే సమయంలో గృహోపకరణాల స్విచ్‌లు తొలగించాలన్నారు. లేకుంటే కాలిపోయే ప్రమాదం ఉందన్నారు.



నేలకొరిగిన విద్యుత్ స్తంభం

తాగునీటి సమస్యలపై ముందస్తు చర్యలు

- యాక్షన్ ప్లాన్ అమలు చేయండి
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

రాబోయే వేసవిలో జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలు తప్పవని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశపు హాలులో వేసవిలో తాగునీటి సరఫరా, వడగాల్పుల పై తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్త చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా తాగునీటి సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ అధికారులు, ఆర్‌డబ్ల్యుఎస్ వంటి శాఖల అధికారులు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి పటిష్టంగా అమలు చేయాలన్నారు. రానున్న వేసవిలో జిల్లాలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో సమస్యాత్మక గ్రామాలను ముందుగానే గుర్తించి, సంబంధిత శాఖల అధికారులందరూ సమన్వయంతో తాగునీటి సమస్య రాకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలన్నారు. మండలస్థాయి అధికారులు తాగునీటి సమస్యపై ప్రత్యేక దష్టి కేంద్రీకరించి ఎక్కడా సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ప్రజలందరికీ రక్షిత మంచినీరు అందించేందుకు రక్షిత తాగునీటి పథకాలలోని ఫిల్టర్ బెడ్స్ కు మరమ్మత్తులు చేయించాలన్నారు.

వడగాలులపై ముందస్తు చర్యలు

పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో వడగాల్పులపై మందస్తుగా తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఎండ తీవ్రత పెరుగుతున్న తరుణంలో ప్రతి గ్రామ పంచాయతీల్లో, మండల కేంద్రాలలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలలో అధికంగా చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, బస్టాండ్, రైల్వే స్టేషన్లు, ఆటో స్టాండ్లు, పబ్లిక్ ప్రాంతాలలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. బస్టాప్, పబ్లిక్ ప్రాంతాలలో నీడ ఉండేలా పందిరి వంటివి ఏర్పాటు చేసుకోవాలని, ఉపాధి హామీ పథకం పనులు జరిగే ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీరు, షామియానాలు వంటివి ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఉదయం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటలలోగా ఎవరు ఎండకు తిరగరాదన్నారు. సమావేశంలో ప్రకృతి వైపరీత్యాల యాజమాన్య డిపిఎం మాధురి, జిల్లా పరిషత్ సిఈఒ బి.చిరంజీవి, డిపిఒ జి.వెంకట నాయుడు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ బాల శంకర రావు, డ్వామా పీడీ జి. జోసఫ్ కుమార్, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డిసిహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబు, ఐసిడిఎస్ పీడీ హేన సుజన, పబ్లిక్ హెల్త్ ఈఈ శ్రీనివాస సంజయ్, గ్రౌండ్ వాటర్ డిడి విద్యా సాగర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిల్లలందరూ బడిలో ఉండేలా చర్యలు

- రక్తహీనత లేకుండా ప్రత్యేక దృష్టి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

బడి వయస్సు పిల్లలందరూ బడిలో ఉండేలా, వారిలో రక్తహీనత లేకుండా ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా అధికారులకు స్పష్టం చేశారు. కలెక్టర్ అధ్యతన జిల్లా స్థాయి బంగారు బాల్యం కమిటీ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెలలో పాఠశాలలు ముగుస్తున్నందున పిల్లలందరూ వేసవి సెలవుల అనంతరం తిరిగి వచ్చేలా ప్రత్యేకంగా దష్టి సారించాలని దిశా నిర్దేశం చేసారు. డ్రాపౌట్స్ లేకుండా చూడాలని, ఎవరైనా పిల్లలు బడి మానివేస్తే అందుకు కారణాలను నిర్దిష్టంగా పరిశీలించాలన్నారు. పాఠశాలలు, అంగన్ వాడీ కేంద్రాలలో అవసరమైన టాయిలెట్లు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో కల్పించాలని ఆదేశించారు. ఈ నెల 8వ తేదీ నుంచి 25వ తేదీ వరకు 7వ విడత పోషణ్ పక్వాడా కార్యక్రమం ఉండటంతో పిల్లలలో పోషకాహార లోపాన్ని నివారించడం పై ప్రత్యేక దష్టి సారించాలన్నారు. కిషోర బాలికల ఆరోగ్యం, ఆహార, జీవన శైలి, వ్యక్తిగత పరిశుభ్రతపైన ప్రత్యేక అవగాహన కల్పించాలని కలెక్టర్ ఆదేశిందారు.

బంగారు బాల్యం కార్యక్రమానికి స్కోచ్ అవార్డు వచ్చినందుకు కమిటీ సభ్యులు ఈ సందర్భంగా కలెక్టర్‌ను సన్మానించారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ హేనా సుజన్, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న. డిఎం,హెచ్ఒ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, బిసి సంక్షేమ అధికారి అంజల, గిరిజన సంక్షేమ అధికారి వరలక్ష్మి, మైనార్టీ సంక్షేమ అధికారి పార్థసారథి, వికలాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన, డిఇఒ ఏ.కిరణ్ కుమార్, డిపిఒ జి.వెంకట నాయుడు, జడ్పీ సిఇఒ బి.చిరంజీవి, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ గాయత్రి దేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ సూరిబాబు, స్టెప్ సిఇఒ శ్రీమన్నారాయణ, డిఆర్‌డిఏ పీడీ నారాయణ, డిసిపిఒ దినేష్ కుమార్, ఆర్ఐఒ సైమన్ విక్టర్, బంగారు బాల్యం నోడల్ అధికారి వెంకటేశ్వరరావు, సార్డ్స్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి ఆర్. సునీల్ కుమార్ పాల్గొన్నారు.